


# శివసూర్య


SHIVA SURYA TELUGU DAILY
RNI APTEL : 2023/88704
తెలుగు దిన పత్రిక



శివసూర్య
విలేకర్లు కావలెను
కర్నూలు జిల్లా, నంద్యాల జిల్లాల నుండి విడుదలవుతున్న సంచలన సమాచార దినపత్రిక శివసూర్య తెలుగు దినపత్రికలో పని చేయుటకు అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్సీ ఇంచార్జ్‌లు & మండల విలేకర్లు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
ఎడిటర్ : బి. శివరాముడు
9494741301, 9346185399.



కర్నూలు సంపుటి : 03, సంచిక : 315 ఛీఫ్ ఎడిటర్.. పేజీలు : 08, వెల రూ. 2రూ/ శనివారం - 18 - జులై - 2026
Published From Kurnool : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa,


## అమెరికా దాడులతో విద్యుత్ సంక్షోభం.. ప్రజలకు ఇరాన్ ప్రభుత్వం కీలక సూచన

### విద్యుత్ మౌలిక సదుపాయాలపై దాడులు జరిగాయని తొలిసారి అంగీకరించిన ఇరాన్



ఢిల్లీ,: అమెరికాతో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో, తమ దేశ విద్యుత్ మౌలిక సదుపాయాలపై దాడులు జరుగుతున్నట్లు ఇరాన్ తొలిసారిగా అంగీకరించింది. మరోవైపు, దేశంలోని దక్షిణ ప్రావిన్సులలో తీవ్రమైన వేడిగాలులు వీస్తుండటంతో విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

## మార్కెట్‌లో భారీ జోష్.. సెన్సెక్స్ 964 పాయింట్ల జంప్!



ఢిల్లీ,: ప్రైవేట్ బ్యాంకింగ్, ఐటీ, ఆటో షేర్లలో భారీ కొనుగోళ్లు నమోదవడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం లాభాలతో ముగిశాయి. ఉదయం నుంచి కొనుగోళ్ల జోరు కొనసాగడంతో సూచీలు రోజంతా గ్రీన్‌లోనే ట్రేడ్ అయ్యాయి. చివరకు సెన్సెక్స్ 964.58 పాయింట్లు ఎగబాకి 78,151.45 వద్ద ముగిసింది. నిఫ్టీ 261.55 పాయింట్లు పెరిగి 24,334.30 వద్ద స్థిరపడింది.

## ఆధునిక హంగులతో ముస్తాబైన మంగళగిరి రైల్వే స్టేషన్... వర్చువల్ గా ప్రారంభించిన ప్రధాని మోదీ



అమరావతి,: ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలో ఉన్న చారిత్రక మంగళగిరి పట్టణానికి రైల్వే పరంగా కొత్త శోభ వచ్చింది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'అమృత్ భారత్ స్టేషన్ పథకం' కింద రూ. 12.56 కోట్ల వ్యయంతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన మంగళగిరి రైల్వే స్టేషన్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు.



## మోదీ, చంద్రబాబు వచ్చాక పరిస్థితులు మారాయి: నరసరావుపేటలో నిర్మలా సీతారామన్

అమరావతి,: ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు లాంటి నేతలు అధికారంలోకి వచ్చాక దేశంలో పరిస్థితులు పూర్తిగా మారాయని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. గతంలో ఫోన్ బ్యాంకింగ్ ద్వారా ఎవరికి రుణాలు ఇవ్వాలో నిర్దేశించే వారని, కానీ ఇప్పుడు బ్యాంకులు నేరుగా ప్రజల వద్దకే వెళ్లి అర్హులైన వారికి అండగా నిలుస్తున్నాయని స్పష్టం

## భారత్‌లో సరికొత్త శకం.. తొలి హైడ్రోజన్ రైలును ప్రారంభించిన ప్రధాని మోదీ

- ★ హర్యానాలో తొలి హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ రైలుకు పచ్చజెండా ఊపిన ప్రధాని
- ★ జింద్-సోనిపట్ మధ్య పరుగులు పెట్టనున్న హైడ్రోజన్ రైలు
- ★ హర్యానాలో రూ.12,470 కోట్లకు పైగా విలువైన జాతీయ రహదారుల ప్రాజెక్టులకు శ్రీకారం
- ★ ఢిల్లీ-కత్రా మధ్య ప్రయాణ సమయాన్ని 14 నుంచి 6 గంటలకు తగ్గించనున్న కొత్త ఎక్స్‌ప్రెస్‌వే
- ★ కురుక్షేత్రలో ఎలివేటెడ్ రైల్వే ట్రాక్, కొత్త మెడికల్ కాలేజీలను జాతికి అంకితం



ఢిల్లీ,: స్వచ్ఛ ఇంధన రవాణా రంగంలో భారతీయ రైల్వే చారిత్రక ముందడుగు వేసింది. దేశంలోనే తొలి హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ రైలును ప్రధాని నరేంద్ర మోదీ ఈరోజు హర్యానాలో జెండా ఊపి ప్రారంభించారు. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న ఈ రైలు, తన ప్రయాణానికి అవసరమైన విద్యుత్‌ను హైడ్రోజన్‌ను ఉపయోగించి స్వయంగా ఉత్పత్తి చేసుకుంటుంది.

# తెలంగాణలో కేటీఆర్ పాదయాత్ర..

## బీఆర్ఎస్‌కు గేమ్ ఛేంజర్ అవుతుందా?

- ➤ కేటీఆర్‌కు అర్బన్ ఏరియాల్లో, యువతలో మంచి క్రేజ్ ఉంది
- ➤ ప్రజలతో మమేకం కావడం ద్వారా పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపవచ్చు
- ➤ ఆరు గ్యారంటీల అమలులో జరుగుతున్న ఆలస్యం, లోపాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడమే కేటీఆర్ ప్రధాన లక్ష్యం




హైదరాబాద్, : తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు సరికొత్త చర్చ నడుస్తోంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వచ్చే ఏడాది నుంచి రాష్ట్రవ్యాప్తంగా భారీ పాదయాత్రకు సిద్ధమవుతున్నారనే వార్తలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. వరుస ఎన్నికల ఓటములతో కొంత ఢీలా పడ్డ క్యాడర్‌లో జోష్ నింపడానికి పోగొట్టుకున్న ప్రజాదరణను తిరిగి దక్కించుకోవడానికి ఈ పాదయాత్రను ఒక బ్రహ్మాస్త్రంగా మలచాలని కేటీఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరి ఈ పాదయాత్ర బీఆర్ఎస్‌కు నిజంగానే 'గేమ్ ఛేంజర్' అవుతుందా? దీని వెనుక ఉన్న వ్యూహాలేంటి? తెలుసుకుందాం.

**చారిత్రక వ్యూహాలపై అధ్యయనం**


తెలుగు రాష్ట్రాల రాజకీయ చరిత్రను పరిశీలిస్తే పాదయాత్రలు ఎప్పుడూ అధికార పీఠాన్ని మార్చే శక్తివంతమైన సాధనాలుగా నిలిచాయి. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేపట్టిన 'ప్రజాప్రస్థానం' కానీ.. ఆ తర్వాత చంద్రబాబు నాయుడు నిర్వహించిన 'వస్తున్నా మీకోసం'.. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన 'ప్రజాసంకల్ప యాత్ర'.. తెలంగాణలో రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, వైఎస్ షర్మిల చేసిన పాదయాత్రలు.. ఇవన్నీ ప్రజాభిప్రాయాన్ని ఏ విధంగా ప్రభావితం చేశాయనే అంశాలపై కేటీఆర్ ప్రత్యేకంగా అధ్యయనం చేస్తున్నట్లు సమాచారం. ఈ యాత్రల ప్లస్ లు, మైనస్ లను విశ్లేషిస్తూ తన రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసుకుంటున్నట్లు పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

## యూపీలో ప్రతిపక్షాల లక్ష్యం అరాచకమే.. వారు జిన్నా ఆరాధకులు: సీఎం యోగి ఆదిత్యనాథ్

- ➤ ప్రతిపక్ష కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు జిన్నా ఆరాధకులంటూ సీఎం యోగి తీవ్ర వ్యాఖ్యలు
- ➤ షామ్లీలో రూ.581 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ➤ 2017కు ముందు షామ్లీ ఉగ్రవాదానికి, వలసలకు కేంద్రంగా ఉండేదని విమర్శ
- ➤ డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో యూపీ స్వరూపమే మారిపోయిందని వ్యాఖ్య



ఢిల్లీ,: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రతిపక్షాలైన కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పార్టీలను 'జిన్నా ఆరాధకులు' అంటూ ఘాటుగా విమర్శించారు. వారికి అవకాశం దొరికినప్పుడల్లా కులం, ప్రాంతం పేరుతో సమాజాన్ని విభజించేందుకు ప్రయత్నిస్తారని ఆయన ఆరోపించారు. అరాచకాన్ని వ్యాప్తి చేయడం, మహిళలు, వ్యాపారుల భద్రతను బలహీనపరచడమే వారి ఏకైక లక్ష్యమని సీఎం యోగి దుయ్యబట్టారు.



## ఓటర్ల జాబితా సవరణ : తెలంగాణలో 60 శాతం డిజిటలైజేషన్ పూర్తి

## బీఆర్ఎస్ 'యువ సంగ్రామ సభ'కు షరతులతో హైకోర్టు గ్రీన్ సిగ్నల్




- ★ నేటి బీఆర్ఎస్ 'యువ సంగ్రామ సభ'కు హైకోర్టు అనుమతి
- ★ శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో భారీ బహిరంగ సభ
- ★ పోలీసులు అనుమతి నిరాకరించడంతో కోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్
- ★ శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా నిర్వహించుకోవాలని స్పష్టమైన షరతులు
- ★ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించనున్న కేటీఆర్

## వ్యవసాయంపై లోకేశ్ కు కనీస అవగాహన లేదు: కాకాణి గోవర్ధన్ రెడ్డి



తాను చెప్పే ఐదు మొక్కల పేర్లు చెప్పాలని లోకేశ్ కి సవాల్
పేర్లు చెబితే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్
కూటమి ప్రభుత్వంలో అవినీతి అక్రమాలు రాజ్యమేలుతున్నాయని ఆరోపణ

# గత విధ్వంసం నుంచి ఏపీని కేంద్రమే నిలబెట్టింది

- ▶▶ గత పాలన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని కేంద్రమే ఆదుకుందని సీఎం చంద్రబాబు వ్యాఖ్య
- ▶▶ నరసరావుపేటలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి రుణాల పంపిణీ
- ▶▶ వివిధ వర్గాల లబ్ధిదారులకు రూ.3,216 కోట్ల రుణాలు అందజేత
- ▶▶ కేంద్ర సహకారంతో రాష్ట్రంలోని అధిక వడ్డీ అప్పుల రీషెడ్యూల్ చేశామన్న సీఎం
- ▶▶ 2047 నాటికి ఏపీని హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా తీర్చిదిద్దుతామని వెల్లడి



అమరావతి,: గత ఐదేళ్ల పాలనలో జరిగిన విధ్వంసం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వమే నిలబెట్టిందని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్రం అందించిన సహకారంతోనే రాష్ట్రం తిరిగి గాడిన పడుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ఆయన 'క్రెడిట్ అవుట్ రీచ్' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. కేంద్రం అందిస్తున్న చేయూత వల్లే రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకోగలుగుతోందని అన్నారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులతో పాటు విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలోనూ కేంద్రం రాష్ట్రానికి అండగా నిలిచిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాల కింద 1,03,246 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ రూ. 3,216 కోట్ల రుణాలను పంపిణీ చేశారు. అనంతరం బాలికలకు సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ..

## ఇప్పుడు అలా కుదరదు.. స్థానిక ఎన్నికలపై నాదెండ్ల మనోహర్ కీలక వ్యాఖ్యలు!



- ● స్థానిక ఎన్నికల్లో పాత ఫార్ములా వర్తించదన్న నాదెండ్ల మనోహర్
- ● పార్టీ బలాబలాలను బట్టి స్థానిక ఎన్నికల్లో పోటీ ఉంటుందని స్పష్టీకరణ
- ● సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రయోజనాల కోసమే వెనక్కి తగ్గామన్న వ్యాఖ్య
- ● జనసైనికుల సమస్యల పరిష్కారానికి 'చర్చావేదిక' ప్రారంభం
- ● వైసీపీ విధ్వంస రాజకీయాలు చేస్తోందని, దుష్ప్రచారం చేస్తోందని ఆరోపణ

## ఫలించిన వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల ఉద్యమం



- ● పిడుగురాళ్ల ప్రభుత్వ మెడికల్ కాలేజీకి ఆమోదం
- ● ఎంపీ గురుమూర్తికి కేంద్ర వైద్యశాఖ సహాయ మంత్రి లేఖ

ఢిల్లీ: వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల ఉద్యమం ఫలించింది. పిడుగురాళ్ల ప్రభుత్వ మెడికల్ కాలేజీకి నేషనల్ మెడికల్ కమిషన్ ఆమోదం తెలిపింది. 2026-27 విద్యా సంవత్సరానికి లెటర్ ఆఫ్ పర్మిషన్ ఇచ్చినట్లు తిరుపతి ఎంపీ గురుమూర్తికి కేంద్ర వైద్యశాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ లేఖ రాశారు. పిడుగురాళ్ల మెడికల్ కాలేజీ సహా 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీ కోసం వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల ఉద్యమం చేపట్టిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన

## టి ఎన్ ఆర్ ఉచిత వివాహ పరిచయ వేదిక బ్రౌచర్ విడుదల



కర్నూలు, శివసూర్య, జూలై 17:ఈనెల 26న జరగబోయే మత్సకార సంక్షేమ సమితి నంద్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టి ఎన్ ఆర్ వివాహ పరిచయఈ బ్రౌచర్ను నంద్యాల 25వ వార్డు కౌన్సిలర్ కృష్ణమోహన్ సతీమణి, మాజీ కౌన్సిలర్ తెలుగు వెంకటలక్ష్మి గారు, లక్కబోయిన ప్రసాద్ గారి సతీమణి శ్రీమతి ఆదిలక్ష్మి , అరుణకుమారి గారు మరియు మహేశ్వరి చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా విడుదలైన బ్రౌచర్ యొక్క మొదటి ప్రతిని శ్రీ వెంకటేశ్వర విద్యా మందిర్ అధినేత, మత్స్యకార సంక్షేమ సమితి గౌరవ అధ్యక్షులు వెంకటరాముడుకి అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మత్స్యకార సంక్షేమ సమితి నంద్యాల జిల్లా అధ్యక్షుడు పత్తికొండ బాలాజీ గారు, వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకరి రాజు , ఉపాధ్యక్షురాలు తెలుగు సరస్వతి, ట్రెజరర్ శ్రీ రమేష్ , జాయింట్ ట్రెజరర్ శ్రీమతి పత్తికొండ ధనలక్ష్మి గారు, జిల్లా కార్యదర్శి దస్తపురి వెంకటలక్ష్మి దేవి , ఆర్గనైజింగ్ సెక్రటరీ ఐకాన్ శివ శంకర్ పాల్గొన్నారు.అలాగే కార్యవర్గ సభ్యులు శ్రీమతి నీలవేణి గారు, దేవి , సరిత మరియు దస్తపురి వెంకటరమణ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.

## ప్రయాణికుల సమస్యలను పరిష్కరించండి. సర్పంచ్ ఓంకార్.




గద్వాల (శివసూర్య ) సిందనూరు బోయలగూడెం ఇందువాసి తదిత గ్రామాలప్రయాణికుల ఇబ్బందులు గమనించి, బస్సు ట్రిప్పులు పెంచాలని డిపో మేనేజర్ కి వినతి పత్రం ఇచ్చిన, బోయిలు గూడెం సర్పంచ్ ఓంకార్. ఆదివారం గవర్నమెంట్ సెలవు రోజు కూడా యధావిధిగా బస్సులు ప్రయాణం కల్పించాలని తెలిపారు.ఐజా నుండి సింధనూరు బస్సు గతంలో ఏడు ట్రిప్పులు తిరిగే బస్సు కేవలం రెండే చ ట్రిప్పులకు పరిమితం చేసిన సందర్భంగా సమస్యను వివరించరు.వెంటనే డి ఎం స్పందించి ఐజా టు సింధనూరు బస్సు యధావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారని, ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించి డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించినట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందువాసి సుధీర్ గౌడ్, గురు నరసన్న,భీమనగౌడ్, పాల్గొన్నారు.

## దక్షిణాయన ప్రారంభంలో శ్రీ గుంటి రంగనాథ స్వామికి విశేష పూజలు ఆచార్య



గద్వాల, శివసూర్య, జూలై 17: జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ తాలూకా ఐజ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు తుప్పత్రాల గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయ గుంటి రంగనాథ స్వామి ఆలయంలో దక్షిణాయన ప్రారంభాన్ని పురస్కరించుకొని విశేష పూజలు, అర్చనలు, సేవా కైంకర్యాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో జీవించాలని, ముఖ్యంగా రైతాంగానికి సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు డి.డి.ఎన్.ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆచార్య చక్రవర్తి చార్యులు తెలిపారు.దక్షిణాయన ప్రారంభం ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టమైన కాలమని, ఈ సందర్భంగా భక్తులు ఆలయాలకు విచ్చేసి దైవ దర్శనం చేసుకొని ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించి ఆశీర్వాదాలు పొందారు.

## వికాస తరంగిణి తో పాటు వరుణయాగం నిర్వహించిన జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు చక్రవర్తి చార్యులు



గద్వాల, శివసూర్య, జూలై 17 : జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ తాలూకా ఐజ మున్సిపాలిటీ కొత్త బస్టాండ్ సమీపంలోని శ్రీ గురు ఓంకార పీఠం, శ్రీలేఖ కిరాణా వద్ద గల స్థలదేవత తాయమ్మ అవ్వ దేవాలయ ప్రాంగణంలో లోక కళ్యాణార్థం, రైతుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా వరుణయాగం ఘనంగా నిర్వహించారు. వరుణ యాగ ఫలితంగా ఒక మోస్తారు వర్షం కురవడం రైతుల్లో ఆనందం వెల్లి ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఈ యాగాన్ని నిర్వహించినట్లు ఆచార్య తెలియజేస్తూఈ కార్యక్రమాన్ని డి.డి.ఎన్.ఎస్ జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆచార్య చక్రవర్తి చార్యులు ఆధ్వర్యంలో వారి బృందం వేదోక్తంగా నిర్వహించింది.ఈ సందర్భంగా ఆచార్య చక్రవర్తి చార్యులు మాట్లాడుతూ, రైతులు సుభిక్షంగా ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరికీ శాంతి సౌభాగ్యాలు కలగాలని సంకల్పంతో ఈ వరుణయాగాన్ని ప్రతిరోజు సుందరకాండ దేవి పురాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## గురువే దైవం.. గురుపూజోత్సవానికి హిందూ సమాజం తరలిరావాలి చక్రవర్తి చార్యులు



ఐజ, శివసూర్య, జూలై 17: భారతీయ సంస్కృతికి, సనాతన ధర్మానికి, గురుపరంపరకు ప్రతీకగా నిర్వహించే గురుపూజోత్సవ మహోత్సవం రేపు ఐజ పట్టణంలోని శ్రీ అంబా భవాని ఆలయం ప్రాంగణంలో వైభవంగా జరగనున్నందున హిందూ బంధువులందరూ కుటుంబ సమేతంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర దూపదీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, జోగులాంబ గద్వాల జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు ఆచార్య చక్రవర్తి చార్యులు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా భారత్ మాత విగ్రహానికి ప్రత్యేక పూజలు, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) వ్యవస్థాపకులు డాక్టర్ కేశవ్ బలిరామ్ హెడ్గేవార్ (డాక్టర్జీ) చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి గురుపూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం గురువులను ఘనంగా సత్కరించి, భారతీయ గురుపరంపర విశిష్టతను చాటిచెప్పే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.గురువును దైవస్వరూపంగా భావించే భారతీయ సంస్కృతిని ప్రతి ఒక్కరూ ఆచరించాలని, సనాతన ధర్మ పరిరక్షణకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. యువతతో పాటు ప్రతి హిందూ కుటుంబం తప్పనిసరిగా పాల్గొని గురుపూజోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు భాజపా రాష్ట్ర నాయకులు రామచంద్రారెడ్డి ఆచార్య సంపర్గ్ ప్రముక్ చక్రవర్తి చార్యులతో పాటు విశ్వ హిందూ పరిషత్ (విహెచ్పీ) నాయకులు ఐజ కండ భరత్ రెడ్డి సంయుక్త ప్రకటనలో తెలిపారు.

## డి.డి.ఎన్. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన చక్రవర్తి చార్యులకు వికాస తరంగిణి సభ్యుల ఘన సత్కారం



గద్వాల, శివసూర్య జూలై 17 తెలంగాణ దూప దీప నైవేద్య (డి.డి.ఎన్.) అర్చక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన జోగులాంబ గద్వాల జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు చక్రవర్తి చార్యులును వికాస తరంగిణి సభ్యులు ఘనంగా సత్కరించారు.గత మూడు సంవత్సరాలుగా జిల్లా అధ్యక్షులుగా అర్చకుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, దేవాలయ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న చక్రవర్తి చార్యులు ఇటీవల హైదరాబాద్ బొగ్గులకుంటలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల్లో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలోని మిత్రబృందం చక్రవర్తి చార్యులను శాలువాతో సత్కరించి, పూలమాలలు వేసి అభినందనలు తెలియజేశారు. వారి ప్రేమాభిమానాలకు చక్రవర్తి చార్యులు కృతజ్ఞతలు తెలిపారు.అలాగే తనపై విశ్వాసం ఉంచి రాష్ట్ర ఉపాధ్యక్ష పదవికి ఏకగ్రీవంగా ఎన్నుకున్న రాష్ట్ర అధ్యక్షులు దౌలతాబాద్ వాసుదేవ శర్మతో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులందరికీ చక్రవర్తి చార్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అర్చకుల సంక్షేమం, హక్కుల సాధన, దేవాలయ అభివృద్ధి కోసం మరింత బాధ్యతతో సేవలందిస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## వెంటనే కేంద్ర బిజెపి ప్రభుత్వం సోనం వాంగ్చుక్ నిరాహాదీక్ష పై స్పందించాలి

**తక్షణమే విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర రాజీనామా చేసి,**

**సైంటిస్ట్ సోనమ్ వాంగ్ చుక్ ప్రాణాలు కాపాడాలి**

**నిరాహార దీక్ష చేపట్టి 19రోజులు గడుస్తున్న స్పందించని బిజెపి వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాం**

**– డా.బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘం మక్తల్ నియోజకవర్గం**

మక్తల్, జులై 17 స్థానికంగా ఐ.బి దగ్గర ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అంబేద్కర్ యువజన సంఘం మక్తల్ నాయకులు మాట్లాడుతూ గత 20 రోజుల క్రితం కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఇటీవల నీట్ వంటి జాతీయ పరీక్షలు వరుసగా లీకులవుతుండటంతో విద్యార్థులు ఒత్తిడి తట్టుకోలేక సూసైడ్ చేసుకొని ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ చేపట్టిన ధర్నాలో పాల్గొన్న సైంటిస్ట్,సామాజికవేత్త సోనం వాంగ్చుక్ విద్యార్థుల ఆత్మహత్యలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్తో నిరాహార దీక్ష చేపట్టి నేటికి 20వ రోజు అవుతున్నపట్టికీ కేంద్రంలోని ప్రధాని మోడీ బిజెపి ప్రభుత్వం కనీస స్పందన లేకుండా దున్నపోతు మీద వాన పడ్డట్టు వ్యవహరిస్తుండటం సిగ్గుచేటనీ తక్షణమే బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం స్పందించాలన్నారు.అదేవిధంగా సోనం వాంగ్ చుక్ సైంటిస్ట్ గా,పర్యావరణవేత్తగా సామాజికవేత్తగా తాను పుట్టిన గడ్డ అయినా లడక్ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేలా కరిగిపోయే కృత్రిమ మంచు పర్వతాలను సృష్టించడం,లడక్ ప్రజల అటవీ మరియు సహజ వనరుల హక్కుల కోసం పోరాడుతూ అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన రామన్ మెగసెస్ వంటి అవార్డులతో దేశానికి గొప్ప పేరును తీసుకొచ్చాడన్నారు.అటువంటి గొప్ప వ్యక్తి ప్రాణాలు కాపాడుకోవాలని దేశ వ్యాప్తంగా ప్రజలు సోషల్ మీడియా,ఇతర మార్గాల ద్వారా మద్దతు తెలుపుతూ ఎడ్యుకేషనల్ మినిస్టర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ బీజేపీ మోడీ ప్రభుత్వం కళ్ళుండి చూడలేని గుడ్డి వారిలా నడుచుకోవాడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.కావున వెంటనే విద్యార్థుల బలవన్ మరణానికి బాధ్యత వహిస్తూ ధర్మేంద్రతో రాజీనామా చేయించి సోనమ్ వాంగ్ చుక్ ప్రాణాలను కాపాడాలన్నారు.లేని యెడల ఢిల్లీలో మొదలైన ఈ ఉద్యమాన్ని గల్లి గల్లికి విస్తరించేలా ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నామన్నారు.కార్యక్రమంలో డా.బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షులు పృథ్వీరాజ్, అంబేద్కర్ యువజన సంఘం కీలక సభ్యులు తల్వార్ నరేష్, సందీప్, నాగేష్ గోలపల్లి తదితరులు పాల్గొన్నారు.

## రిపోర్టర్ నరేష్ కుమారుడు జన్మదిన వేడుకల్లో పాల్గొన్న అధ్యక్షుడు శానూర్ బాబా

మోటకొండూర్ జులై 17 యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల నవ తెలంగాణ రిపోర్టర్ పుల్లే నరేష్ యాదవ్ కుమారుడు జస్వంత్ యాదవ్ మొదటి జన్మదిన వేడుకలకు తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు, జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు మహమ్మద్ షానూర్ బాబా హాజరై కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ లు సుర్వంగ శ్రీనివాస్, చందు, విక్రం, రమేష్, సిరిగిరి స్వామి, నాగరాజు, పరశురాములు, నవీన్, తదితరులు పాల్గొన్నారు

## చిన్న, సన్నకారు రైతులు 2.5 ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేయండి - ఏపీఓ రామకృష్ణ

తుగ్గలి జూలై 17.(చిన్న, సన్నకారు రైతులు ఆదాయం పెంచుకునేందుకు 2.5 ఎకరాల్లో పండ్ల తోటల సాగు చేపట్టాలని ఏపీవో రామకృష్ణ సూచించారు. శుక్రవారం తుగ్గలిలో ని వి బి జి జి రామ్ జి,కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పండ్ల తోటల సాగుకు 100% వరకు సబ్సిడీ అందిస్తుందని తెలిపారు. మామిడి, జామ, నిమ్మ, దానిమ్మ వంటి పలు రకాల పంటలు సాగు చేస్తే మంచి లాభాలు వస్తాయన్నారు."2.5 ఎకరాల్లో పండ్ల తోట వేస్తే సంవత్సరానికి లక్షల్లో ఆదాయం వస్తుందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు వెంటనే తమ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలి" అని ఏపీఓ రామకృష్ణ కోరారు.కార్యక్రమంలో ఈసీ రాజశేఖర్,టి ఏలు , తదితరులు పాల్గొన్నారు.

## పంటల బీమా నమోదు 31-07-2026 వరకు - తుగ్గలి ఏఓ సురేష్ బాబు

తుగ్గలి జులై 17.తుగ్గలి మండలంలోని రైతులకు పంటల బీమా పథకం ద్వారా భరోసా కల్పించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తుగ్గలి వ్యవసాయ అధికారి సురేష్ బాబు తెలిపారు. ఖరీఫ్-2026 వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం ఆర్ డబ్ల్యు బి సి ఐ ఎస్, కింద లోన్ మరియు నాన్-లోన్ రైతులు 31-07-2026 వరకు నమోదు చేసుకోవాలన్నారు. పంట రుణం తీసుకున్న రైతులు 1-4-26 నుండి 31-7-26 వరకు బ్యాంకు లేదా మీసేవ కేంద్రం ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు. ఇప్పటికే దరఖాస్తు చేయని రైతులు చివరి తేదీ వరకు ఆగకుండా వెంటనే నమోదు పూర్తి చేసి పంటల బీమా రక్షణ పొందాలని కోరారు. మరిన్ని వివరాలకు వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

## ఇంట్లోనే విషాదం: కరెంట్ షాక్ తో యువ మహిళ మృతి

తుగ్గలి, జూలై 1)తుగ్గలి మండలంలో విషాదం చోటుచేసుకుంది. రోజువారీ పనుల్లో భాగంగా చేసిన చిన్న పొరపాటు ఒక ఇంట్లో దీపం ఆర్పేసింది. జొన్నగిరి గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. రాంపురం గ్రామానికి చెందిన తలారి అనిత(34)భర్త లేట్ బాల ఆంజనేయులు. తల్లిదండ్రులను చూసేందుకు జొన్నగిరికి వచ్చింది.ఇంట్లో బట్టలు ఉతుకుతుండగా నీళ్లు అయిపోయాయి. మోటారు ఆన్ చేయడానికి వెళ్లి కరెంట్ బోర్డు నుంచి వచ్చే ప్లగ్ ను బాక్స్ లో పెడుతుండగా ఒక్కసారిగా షాక్ తగిలింది. కుటుంబ సభ్యులు పరుగున వచ్చి చూసేసరికే అనిత స్పృహ కోల్పోయి ఉంది. ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే ఆమె ప్రాణాలు విడిచింది.సమాచారం అందుకున్న జొన్నగిరి పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతురాలి తండ్రి సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు.అనితకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఇప్పటికే భర్తను కోల్పోయిన ఆ కుటుంబానికి ఇది రెండో పెద్ద దెబ్బ. ఘటనతో జొన్నగిరి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తడి చేతులతో ఎలక్ట్రిక్ పరికరాలు ముట్టుకోవద్దని, చిన్న పనులకైనా జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచించారు.

## పూలతోట స్కూల్లో తహసిల్దార్ రాజేంద్ర మెరుపు తనిఖీ స్వయంగా మధ్యాహ్నం భోజనం రుచి చూసి నాణ్యత పరిశీలన!!

మెనూ పక్కాగా అమలు చేయాలని సిబ్బందికి ఆదేశం..

విద్యార్థులతో ముచ్చటించి వివరాలు అడిగి తెలుసుకున్న తహసిల్దార్ రాజేంద్ర

దొరవారి సత్రం జూలై 17 తిరుపతి స్టాఫ్ రిపోర్టర్ దొరవారిసత్రం మండల తహసిల్దార్ రాజేంద్ర పూల తోట గ్రామ హై స్కూల్ ను ఆకస్మికంగా సందర్శించి అక్కడ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనం పథకాన్ని స్వయంగా పరిశీలించారు. వంటగది క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన తహసిల్దార్.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోజువారి మెనూపక్కగా అమలు చేయాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు ఈ కార్యక్రమంలో తనిఖీల్లో భాగంగా వండిన మధ్యాహ్నం భోజనాన్ని రాజేంద్ర స్వయంగా రుచి చూసి నాణ్యతను పరీక్షించడంతోపాటు భోజనం ఎలా ఉందో అక్కడ ఉన్న చిన్నాన్న అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్య పౌష్టికాహారం అందించడంలో ఎలాంటి రాజీ పడకూడదని పాఠశాలలో తాగునీరు కనీస మౌలిక వసతులు ఎల్లప్పుడు మెరుగ్గా ఉండాలని సందర్భంగా దిశా నిర్దేశం చేశారు.

## భారీ రుణ వితరణ... ఎన్డీయే ప్రభుత్వ మరో గొప్ప ఆర్థిక సంస్కరణ : ప్రత్తిపాటి.

చిలకలూరిపేట: జూలై-1కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన రుణ పంపిణీతో దేశ ఆర్థిక ప్రగతిలో వేగం పెరిగి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయి : ప్రత్తిపాటిలి బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల సహకారంతో పేద సామాన్య వర్గాల జీవన విధానాన్ని మెరుగుపరిచే గొప్ప ఆర్థిక సంస్కరణకు కేంద్రం శ్రీకారం చుట్టింది : ప్రత్తిపాటిఎమ్.ఎస్.ఎమ్.ఈల ఏర్పాటు, వ్యవసాయాభివృద్ధి, మహిళలు, నిరుద్యోగ యువత ఆర్థిక సాధికారతకు మోదీ అందిస్తున్న చేయూత, చంద్రబాబు సహకారంతో దేశ ర్థిక రంగంలో అద్భుత ఫలితాలు : ప్రత్తిపాటిలి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా నేడు పల్నాడు జిల్లాలో జరిగిన భారీ రుణ వితరణ కార్యక్రమం దేశ ఆర్థిక ప్రగతిలో కొత్త అధ్యాయానికి నాంది పలకనుంది. 1,03,246 మందికి రూ.3,216 కోట్ల రుణ పంపిణీతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేతి, కుల వృత్తులు, రైతులు, మహిళలు, నిరుద్యోగ యువత ఆర్థిక భద్రతకు గొప్ప భరోసానిచ్చాయి అనడం అతిశయోక్తి కాదు. బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల సహకారంతో కేంద్రం పేద, సామాన్య వర్గాల జీవన విధానాన్ని మెరుగుపరిచే దిశగా చేపట్టిన మరో గొప్ప ఆర్థిక సంస్కరణ ఈ రుణాల పంపిణీ.స్వయం ఉపాధికి ప్రోత్సాహన్నివ్వడంతో పాటు.. ఉపాధి అవకాశాల పెరుగుదల, ఆర్థిక వృద్ధికి తోడ్పడే విప్లవాత్మక సామాజిక కార్యక్రమం ఈ రుణ పంపిణీ. రుణాల ద్వారా పెట్టుబడులు పెరిగి, ఉత్పత్తి, వినియోగం, ఎగుమతులు ఊపందుకోవడంతో దేశ జీడీపీ మునుపటి కంటే మెరుగ్గా వృద్ధి చెందుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముందుచూపుతో ఇప్పటివరకు బ్యాంకుల సేవలకు నోచుకోని అనేక వర్గాలకు ఇకపై అధికారిక బ్యాంకింగ్ సేవలు వేగంగా, సరళంగా అందుబాటులోకి రానున్నాయి. తక్కువ వడ్డీలకే బ్యాంకులు అందించే రుణాలతో ప్రజలకు వడ్డీ వ్యాపారులు బాధ తొలగడంతో పాటు.. అప్పులభారం నుంచి ఉపశమనం లభిస్తుంది. కొత్త వ్యాపారాల ఏర్పాటు, విస్తరణతో ప్రభుత్వాలకు పన్నుల రూపంలో ఆదాయం పెరిగి, ప్రజలకు మరింత మేలైన సంక్షేమం, అభివృద్ధి ఫలాలు చేరువ అవుతాయి. మోదీ చేయూత, చంద్రబాబు సహకారంతో ఆర్థిక రంగంలో అద్భుత ఫలితాలు.ఎమ్.ఎస్.ఎమ్.ఈ, వ్యవసాయాభివృద్ధి, మహిళలు, నిరుద్యోగ యువత ఆర్థిక సాధికారతకు మోదీ అందిస్తున్న చేయూత, చంద్రబాబు సహకారంతో భారత ఆర్థిక రంగం భవిష్యత్ లో అద్భుత ఫలితాలు సాధించబోతోంది.ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్న కూటమిప్రభుత్వ లక్ష్యసాధనకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపకరిస్తాయి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వినూత్న ఆలోచనలు, విశాల ధృక్పథంతో గ్రామీణాభివృద్ధి పాటు, విస్తృత ఉపాధి అవకాశాలకు దారి చూపుతాయి. రుణాల పంపిణీ, సద్వినియోగంతో వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు, ఉపాధి పెరిగి.. ఆదాయ అవకాశాలు మెరుగుపడి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఊహించని విధంగా బలోపేతం అవుతుంది." అని ప్రత్తిపాటి శుక్రవారం ఒక ప్రకటనలో అభిప్రాయపడ్డారు.

## పల్నాడు జిల్లాలో రుణ వితరణ కార్యక్రమానికి హాజరైన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రివర్యులు నిర్మల్ సీతారామన్

రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు

నరసరావుపేట: జూలై-17 ఈరోజు పల్నాడు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజు..పల్నాడు ప్రజల ఆర్థిక ప్రగతికి, స్వయం సమృద్ధికి సరికొత్త బాటలు వేస్తూ.. జిల్లావ్యాప్తంగా లక్ష మందికి పైగా లబ్ధిదారులకు ఒకే వేదికపై.. ఒక్క రోజులోనే ఏకంగా రూ. 3,216 కోట్ల రుణాలు అందించడం అనేది నియోజకవర్గం చరిత్రలోనే ఒక అపూర్వ ఘట్టం.రాష్ట్రంలోనే మొదటిసారిగా మన పల్నాడు జిల్లాలో ఇంతటి భారీ రుణ మేళా కార్యక్రమం జరగడానికి అండగా నిలిచిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రివర్యులు శ్రీమతి నిర్మలా సీతారామన్ కి, ఇంతటి మంచి కార్యక్రమాన్ని కేవలం ఒక ప్రాంతానికే పరిమితం చేయకుండా, రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి లక్షలాది పేద కుటుంబాల్లో వెలుగులు నింపాలని సంకల్పించిన మన ప్రియతమ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు కి నా హృదయపూర్వక ధన్యవాదములు.

## కంప్యూటర్, కుట్టు మిషన్ నైపుణ్య శిక్షణలు ప్రారంభం

, :వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో ఎంపవర్ గర్ల్ చైల్డ్ ప్రాజెక్ట్ ద్వారా విద్య, నైపుణ్యాభివృద్ధి మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన మూడు ముఖ్య కార్యక్రమాలు నేడు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాలకు ఐటిడిఎ పాడేరు ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆదిత్య వర్మ, ఐ ఎ ఎస్ ముఖ్య అతిథిగా హాజరయి ప్రారంభించారు. మొదటగా, వాసవ్య మహిళా మండలి ఆఫీసు కు చేరుకొని కుట్టు మిషన్ నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళలు మరియు యువతులు ఈ శిక్షణ ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకొని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంప్యూటర్ స్కిల్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో కంప్యూటర్ నైపుణ్యాలు ప్రతి యువతకు అత్యంత అవసరమని, శిక్షణను పూర్తిగా సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం పెద్దబరాడ గ్రామ పంచాయతీ పరిధిలోని కృష్ణాపురం జెడ్పీ హైస్కూల్లో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేలా ఈ భవనం ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా వాసవ్య మహిళా మండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ సునీత మాట్లాడుతూ, ఎంపవర్ గర్ల్ చైల్డ్ ప్రాజెక్ట్ ద్వారా బాలికలు, యువతులు మరియు మహిళల విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన, సాధికారత లక్ష్యంగా వివిధ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. చింతపల్లి లోని యన్ ఆర్ టెక్ హబ్ కంప్యూటర్

# 5జీ యూజర్లు 110 కోట్లు!

## 2031 నాటికి మొత్తం కనెక్షన్లలో 81 శాతానికి వాటా
## 70 జీబీకి నెలవారీ డేటా వాడకం
## భారత్ టెలికం మార్కెట్‌పై ఎరిక్సన్ నివేదిక




న్యూఢిల్లీ: వచ్చే ఆరేళ్లలో 2031 నాటికి భారత్‌లో 5జీ యూజర్ల సంఖ్య 110 కోట్లకు చేరనుంది. మొత్తం కనెక్షన్లలో 5జీ వాటా 81 శాతానికి చేరనుంది. స్వీడన్‌కి చెందిన టెలికం పరికరాల తయారీ సంస్థ ఎరిక్సన్ రూపొందించిన నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. 2025 ఆఖరు నాటికి దేశీయంగా 5జీ యూజర్ల సంఖ్య 43 కోట్లకు, మొత్తం మొబైల్ సబ్ స్క్రిప్షన్లలో వాటా 35 శాతానికి చేరిందని రిపోర్టు పేర్కొంది. మొబైల్ బ్రాడ్‌బ్యాండ్ మెరుగుపడటంతో 5జీ వినియోగం గణనీయంగా పెరుగుతోందని ఎరిక్సన్ ఇండియా ఎండీ నితిన్ బన్సల్ తెలిపారు. భారీ స్థాయిలో సమ్మిళితత్వం, గవర్నెన్స్, ఆవిష్కరణలకు పటిష్టమైన, సురక్షితమైన 5జీ మౌలిక సదుపాయాలు తోడ్పడుతున్నాయని, డిజిటల్ ఇండియాకి శక్తివంతమైన పునాది వేస్తున్నాయని వివరించారు. ఈ క్రమంలో కస్టమర్లను ఆకర్షించేందుకు కంపెనీలు వైవిధ్యమైన సర్వీసులను కూడా ప్రవేశపెడుతున్నాయని నివేదిక పేర్కొంది. నేరుగా ఎయిర్‌టెల్‌ని ప్రస్తావించకుండా, పోస్ట్‌పెయిడ్ 5జీ కస్టమర్లకు ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న సందర్భాల్లోనూ మెరుగైన సేవలు అందేలా ఓ టెలికం కంపెనీ .. నెట్‌వర్క్ స్లైసింగ్ ఇటీవలే వైవిధ్యమైన కనెక్టివిటీ సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు వివరించింది.

### నివేదికలోని మరిన్ని విశేషాలు..

డివైజ్‌లు చౌకగా లభిస్తుండటం, నెట్‌వర్క్ కవరేజీ

విస్తృతంగా ఉండటం, ఫిక్స్‌డ్ వైర్‌లెస్ యాక్సెస్ (ఎఫ్‌డబ్ల్యూఏ) సేవలు అందుబాటులోకి వస్తుండటంతో 5జీ వినియోగం భారీగా పెరుగుతోంది. చాలా మటుకు సర్వీస్ ప్రొవైడర్లకు సంబంధించి డౌన్‌లింక్ కన్నా అప్‌లింక్ ట్రాఫిక్ వేగంగా పెరుగుతోంది.

ప్రతి స్మార్ట్‌ఫోన్‌పై మొబైల్ డేటా వినియోగం విషయంలో గ్లోబల్‌గా భారత్ అగ్రస్థానంలో ఉంటోంది. నెలవారీ యూసేజీ సగటున 37 జీబీగా ఉండగా, 2031 నాటికి 70 జీబీకి చేరనుంది.

46 శాతం వాటాతో 4జీ ఇప్పటికీ ప్రధాన టెక్నాలజీగానే కొనసాగుతున్నప్పటికీ దాని వినియోగం క్రమంగా తగ్గుతోంది. 2025లో 57 కోట్లుగా ఉన్న యూజర్ల సంఖ్య 2031 నాటికి 16 కోట్లకు పడిపోనుంది.

అంతర్జాతీయంగా 5జీ మొబైల్ సబ్ స్క్రిప్షన్ల సంఖ్య 2026 తొలి త్రైమాసికంలో తొలిసారిగా మూడు వందల కోట్ల మార్కును దాటింది. ఈ ఏడాది మొదటి క్వార్టర్‌లో గ్లోబల్‌గా 16.2 కోట్ల కొత్త 5జీ కనెక్షన్లు జత కావడంతో మొత్తం సబ్‌స్క్రిప్షన్ల సంఖ్య 310 కోట్లకు చేరింది. ఇది 2031 నాటికి రెట్టింపు కన్నా అధిక స్థాయికి (640 కోట్లు) చేరనుంది.

ఇప్పటివరకు 390 సర్వీస్ ప్రొవైడర్లు కమర్షియల్ 5జీ సర్వీసులు ప్రారంభించాయి. 90కి పైగా సంస్థలు 5జీ సేవలను స్టాండెలోన్ ప్రాతిపదికన ప్రవేశపెట్టాయి.

2025 ఆఖరు నాటికి మొత్తం మొబైల్ డేటా ట్రాఫిక్‌లో 48 శాతం వాటా 5జీ నెట్‌వర్క్‌లదే ఉంది. 2031 ఆఖరు నాటికి ఇది 85 శాతానికి చేరొచ్చని అంచనా.

పశ్చిమ యూరప్, ఉత్తర అమెరికా, ఈశాన్య ఆసియా, గల్ఫ్ దేశాల్లో 5జీ సేవల వినియోగం 2031 నాటికి 90 శాతానికి చేరవచ్చు.

ఫిక్స్‌డ్ వైర్‌లెస్ యాక్సెస్ (ఎఫ్‌డబ్ల్యూఏ)కి సంబంధించి వేగం ఆధారిత టారిఫ్ ప్లాన్ల ద్వారా వివిధ మార్కెట్ వర్గాలను ఆకట్టుకునే ప్రయత్నాలను టెల్కోలు కొనసాగిస్తాయి.

మొత్తం ఎఫ్‌డబ్ల్యూఏ సర్వీస్ ప్రొవైడర్లలో 5జీ ద్వారా సేవలందించే సంస్థల వాటా 71 శాతానికి చేరింది. 2025 జూన్‌లో ఇది 57 శాతంగా ఉంది. స్పీడ్ ఆధారిత టారిఫ్ ప్లాన్లను అందించే ఎఫ్‌డబ్ల్యూఏ సర్వీస్ ప్రొవైడర్ల సంఖ్య గతేడాది 51 శాతంగా ఉండగా ప్రస్తుతం 57 శాతానికి చేరింది.

# జెన్-ఆల్ఫాకి ఎప్పటికీ దీని గురించి తెలియకపోవచ్చు!




జెన్-ఆల్ఫా (2010 నుంచి 2025 మధ్య జన్మించిన వారు) పెరుగుతున్న ప్రపంచంలో స్క్రీన్‌లు, స్మార్ట్ డివైస్‌లు జీవితంలో సహజ భాగాలు. వారికి ఇంటర్నెట్ లేకుండా గడిచిన రోజులు కథల్లో వినే విషయాల్లా అనిపించే అవకాశం ఉంది. డిజిటల్ కనెక్షన్ ఎప్పుడూ అందుబాటులో ఉండటంతో "ఆఫ్‌లైన్ జీవితం" అనే భావనే ఈ కొత్త తరానికి అపరిచితంగా మారుతోంది. జెన్ ఆల్ఫా వాళ్లు ఇంటర్నెట్, డిజిటల్ పరికరాలను వాడుతూనే పెరుగుతున్నారు. అది వారి రోజువారీ జీవితంలో సహజ భాగంగా మారిపోయింది. వారు చదవడం, వినోదం పొందడం, కొత్త విషయాలు తెలుసుకోవడం, విసుగొచ్చినప్పుడు లేదా ఒంటరిగా అనిపించినప్పుడు మాట్లాడడం వంటి పనులన్నీ ఎక్కువగా డిజిటల్ పరికరాలు, ఆన్‌లైన్ వేదికల ద్వారానే చేస్తున్నారు. అంతకుముందున్న తరాలవారికి ఆన్‌లైన్‌లో ఉండటం ఒక కార్యకలాపం. వారు లాగిన్ అయ్యేవారు, అంతర్జాలంలో కొంత సమయం గడిపేవారు, తర్వాత లాగ్ ఆఫ్ అయ్యేవారు. జెన్ ఆల్ఫాకు మాత్రం ఇంటర్నెట్ అనేది వారు పెరిగే వాతావరణంగా మారిపోయింది. జెన్ ఆల్ఫా తరం కంటే ముందు ఉన్న తరాలు ఇంటర్నెట్ లేకుండా కూడా జీవితాన్ని గడిపాయి. ప్రత్యక్షంగా మనుషులను కలుసుకోవడం, బయట ఆటలు ఆడటం, పుస్తకాల ద్వారానే సమాచారం తెలుసుకోవడం వంటి "ఆఫ్‌లైన్" జీవన విధానాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేని తొలి తరంగా జెన్ ఆల్ఫా తరం మారవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. అంటే ఇంటర్నెట్ లేని జీవితం ఎలా ఉండేదో జెన్ ఆల్ఫా వారికి పూర్తిగా తెలియకపోవచ్చు. అంటే పిల్లల జీవితంలోని అన్ని దశల్లో, అన్ని విధాలుగా వర్చువల్ సంస్కృతి పెరుగుతోంది. డిజిటల్ ప్రపంచంలో జరిగే సామాజిక, విద్యా, వినోద కార్యకలాపాలకే వారు పరిమితం అవుతున్నారు. జెన్ ఆల్ఫాకు సాంకేతికత కేవలం వినోదం లేదా అభ్యాసానికి ఉపయోగించే సాధనం కాదు. సమాచారం పొందడం, సంభాషించడం, తమ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అనుభవించడం వంటి విషయాల్లో అది ప్రధాన మార్గంగా మారుతోంది.

### బ్లాక్‌బోర్డుల నుంచి స్మార్ట్‌బోర్డుల వరకు..

కొన్ని సంవత్సరాలు వెనక్కి వెళ్తే.. మనం బ్లాక్‌బోర్డులను ఉపయోగించేవాళ్లమని గుర్తుకు వస్తుంది. ఉపాధ్యాయులు బోర్డులపై రాసేవారు. విద్యార్థులు వాటిని కాపీ చేసేవారు. యువతపై ప్రభావం చూపుతూ వేగవంతమైన సాంకేతికత ప్రపంచాన్ని వేగంగా మార్చేస్తోంది. 2025లో భారత్‌లోని స్కూళ్లలో తరగతి గదుల??లో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. బ్లాక్‌బోర్డుల స్థానంలో స్మార్ట్‌బోర్డులు వచ్చాయి. ఇప్పుడు విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించడానికి ఎక్కువగా రాయడం లేదు. వీడియోలు చూపిస్తున్నారు, పీడీఎఫ్‌లు తెరిచి బోధిస్తున్నారు. మన తల్లిదండ్రులు మన చిన్నతనంలో చెప్పిన "ఫోన్ ఎక్కువగా చూడొద్దు, కళ్లపై ప్రభావం పడుతుంది" లేదా "స్క్రీన్ సమయం తగ్గించు" అనే మాటలు ఇప్పుడు పనిచేయడం లేదు. ఒకప్పుడు దృష్టి మళ్లించే వస్తువులుగా భావించిన అదే స్క్రీన్లు ఇప్పుడు తరగతి గదులు, గ్రంథాలయాలు, చదువులో భాగస్వాములుగా మారాయి.

### బియ్యం బస్తాల్లా బ్యాగులు ఉండేవి కదా..

పాఠశాల బ్యాగు పరిస్థితి మీకు గుర్తుండే ఉంటుంది. బియ్యం బస్తాల్లా బ్యాగులను మోసుకెళ్లేవాళ్లం. 6వ తరగతికే వెన్నునొప్పి వచ్చేది. ఐదారు సబ్జెక్టుల పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు ఉండేవి. జెన్ ఆల్ఫా పిల్లల సంగతే వేరు. తేలికైన బ్యాగులు ఉంటున్నాయి. కొన్ని స్కూళ్లకు పిల్లలు బ్యాగులు లేకుండానే వెళ్తున్నారు. ఎందుకంటే పాఠ్యపుస్తకం ఇప్పుడు పీడీఎఫ్ రూపంలో ఉంది. నోట్స్ గూగుల్ డాక్‌లో ఉన్నాయి. హోం వర్క్ గూగుల్ క్లాస్‌రూమ్‌లో ఇస్తున్నారు. చదువుకు సంబంధించిన అనేక విషయాలు వాట్సాప్ గ్రూపుల్లో లింక్ రూపంలో వస్తున్నాయి. అన్నీ టాబ్లెట్ లేదా ల్యాప్‌టాప్‌లోని ఒక ఫోల్డర్‌లో క్రమబద్ధంగా, సెర్చ్ చేయడానికి సులభంగా ఉంటాయి. గత తరాలు పుస్తకాలను చదవడం నేర్చుకున్నాయి. నేటి విద్యార్థులు వీడియోలు, సామాజిక మాధ్యమాలు, ఆగ్మెంటెడ్ రియాలిటీ, కృత్రిమ మేధస్సు ద్వారా ప్రపంచాన్ని అర్థం చేసుకోవడం నేర్చుకుంటున్నారు. ఆగ్మెంటెడ్ రియాలిటీ అంటే డిజిటల్ చిత్రాలు, సమాచారం జోడించి చూపే సాంకేతికత. జెన్ ఆల్ఫా, స్క్రీన్ల మధ్య బంధం ఇప్పటికే పెరుగుతుండగా, కోవిడ్-19 మహమ్మారి దాన్ని మరింత వేగవంతం చేసింది. దాదాపు మూడు సంవత్సరాలు విద్యార్థులు ఇళ్లకే పరిమితమయ్యారు. తరగతులకు హాజరయ్యారు, పరీక్షలకు సిద్ధమయ్యారు, అసైన్‌మెంట్‌లు సమర్పించారు, స్నేహ సంబంధాలు కూడా పరికరాల ద్వారానే కొనసాగించారు. స్క్రీన్లు ఆప్షన్‌గా కాకుండా అత్యవసరంగా మారాయి. దీనిలో ఉన్న మంచి విషయం నిజమే. వీడియోలో అగ్నిపర్వత విస్ఫోటనాన్ని చూసే పిల్లవాడు లేదా రంగులతో కూడిన కిరణజన్య సంయోగక్రియ చలనచిత్రాన్ని చూసే పిల్లవాడు... బోర్డుపై గీసిన చాక్ చిత్రాన్ని చూసే పిల్లవాడితో పోల్చితే దాన్ని భిన్నంగా అర్థం చేసుకుంటాడు. ఇప్పుడు "పుస్తకం ఇంట్లో మరిచిపోయాను" అనే మాట లేదు. "అన్నీ నా చేతిలోనే ఉన్నాయి" అనే పరిస్థితి వచ్చింది. విద్యార్థులు అదే స్క్రీన్‌పై వారు యూట్యూబ్ చూస్తారు, స్నేహితులతో సంభాషిస్తారు. జెన్ ఆల్ఫా పిల్లవాడికి ఏదైనా అర్థం కాకపోతే పేరాను మళ్లీ చదవడు.. వీడియో కోసం వెతుకుతాడు. అది 8 నిమిషాల కంటే ఎక్కువ ఉంటే, అవసరమైన భాగానికి నేరుగా వెళ్లిపోవచ్చు. ఇప్పుడు దాదాపు ప్రతి ప్రశ్నకు వెంటనే సమాధానం లభిస్తుంది. మిలీనియల్స్, జెన్ జెడ్ తరాలకు ఆఫ్‌లైన్‌లో ఉండటం రోజువారీ జీవితంలో సాధారణ భాగం. జెన్ ఆల్ఫాకు "ఆఫ్‌లైన్" క్రమంగా ఒక అనుభవం కంటే ఒక భావనగా మారవచ్చు. వారు దాని గురించి వింటారు గానీ, తరచుగా అనుభవించకపోవచ్చు.

# జాబ్స్ కాదు.. ఏఐతో ఇంకా చాలా పోవచ్చు: సత్య నాదెళ్ల




కృత్రిమ మేధ (ఏఐ) మనుషుల ఉద్యోగాలను తినేస్తుందనే భయాలు ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీస్తున్నాయి. అయితే మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల మరింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏఐ వల్ల సృష్టించే విలువ, సంపద, జ్ఞానం అన్నీ కొద్ది కంపెనీల చేతుల్లోనే కేంద్రీకృతమైతే ఏం జరుగుతుందో చెబుతూ ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఉద్యోగాలు పోవడమే కాదు.. అంతకు మించిన ముప్పు పొంచి ఉందని అంటున్నారాయన. ఏఐ వల్ల వచ్చే లాభాలు, జ్ఞానం, వ్యాపార విలువ అంతా కొద్ది కంపెనీల చేతుల్లోనే కేంద్రీకృతమవడం అసలు ముప్పని సత్య నాదెళ్ల హెచ్చరిస్తున్నారు. సామాజిక మాధ్యమం ఎక్స్‌లో చేసిన సుదీర్ఘ పోస్టులో నాదెళ్ల.. ఏఐ విప్లవాన్ని కేవలం మరో సాంకేతిక మార్పుగా చూడకూడదన్నారు. అలా జరిగితే మిగతా సంస్థలు తమ సొంత పరిజ్ఞానం, అనుభవం, పోటీపడే సామర్థ్యాన్ని కోల్పోయి పూర్తిగా వాటిపైనే ఆధారపడాల్సి వచ్చే ప్రమాదం ఉందని అంటున్నారు. గతంలో డిజిటల్ టూల్స్ ఉద్యోగుల ఉత్పాదకతను పెంచడానికి మాత్రమే ఉపయోగపడేవని.. కానీ ఇప్పుడు మనుషులు, ఏఐ వ్యవస్థలు పరస్పరం నేర్చుకునే కొత్త దశలోకి ప్రపంచం అడుగుపెడుతోందని వివరించారు. దీనిని ఆయన "కాగ్నిటివ్ లూప్"గా అభివర్ణించారు. భవిష్యత్తులో సంస్థల విజయాన్ని నిర్ణయించేది కేవలం డబ్బు లేదంటే యంత్రాలో కాదని నాదెళ్ల అభిప్రాయపడ్డారు. ఉద్యోగుల అనుభవం, ఆలోచనా శక్తి, నిర్ణయ సామర్థ్యం, సృజనాత్మకత ఎంత ముఖ్యమో.. ఏఐ ఆధారంగా సంస్థలు సొంతంగా అభివృద్ధి చేసుకునే సామర్థ్యాలు కూడా అంతే ముఖ్యమని చెప్పారు. అయితే ఈ రెండింటిలోనూ మనిషే కేంద్రబిందువుగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఏఐ ఎంత అభివృద్ధి చెందినా.. లక్ష్యాలను నిర్దేశించడం, కొత్త ఆలోచనలను సృష్టించడం, విభిన్న రంగాల మధ్య సంబంధాలను గుర్తించడం వంటి అంశాల్లో మనుషుల పాత్ర కీలకంగానే ఉంటుందని పేర్కొన్నారు. అయితే నాదెళ్ల ఆందోళన ఏఐ వల్ల ఉద్యోగాలు పోతాయన్నది కాదు. కొద్ది సంఖ్యలో ఉన్న శక్తివంతమైన ఏఐ మోడళ్లపై ప్రపంచంలోని కంపెనీలు పూర్తిగా ఆధారపడిపోతే.. తమ సొంత పరిజ్ఞానం, మేధోసంపత్తి, అనుభవాన్ని క్రమంగా కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. "ప్రతి రంగంలోని ప్రతి సంస్థ సృష్టించిన విలువ అంతా కొద్ది ఏఐ మోడళ్ల చేతుల్లోకి వెళ్లే ప్రపంచాన్ని మనలో ఎవరూ కోరుకోరు" అని వ్యాఖ్యానించారాయన. ఈ సందర్భంలో ఆయన ప్రపంచీకరణ తొలి దశను ఉదాహరణగా ప్రస్తావించారు. తయారీ పరిశ్రమలు ఒక దేశం నుంచి మరో దేశానికి తరలిపోవడంతో ఆర్థిక వృద్ధి కాగితాలపై కనిపించినా.. అనేక ప్రాంతాలు, వర్గాలు శాశ్వతంగా నష్టపోయాయని గుర్తు చేశారు. అదే పరిస్థితి ఇప్పుడు ఏఐ యుగంలోనూ పునరావృతమయ్యే ప్రమాదం ఉందన్నారు. కంపెనీలు దశాబ్దాలుగా కూడబెట్టుకున్న అనుభవం, పరిజ్ఞానం, వ్యాపార విలువ మొత్తం ఏఐ వ్యవస్థల్లో కలిసిపోతే.. దాని ద్వారా వచ్చే లాభాలు మాత్రం కొద్ది సంస్థలకే పరిమితమయ్యే ప్రమాదాన్ని ఆయన ఎత్తిచూపారు. అందుకే "ఫ్రాంటియర్ మోడల్" కాకుండా "ఫ్రాంటియర్ ఎకోసిస్టమ్" అవసరమని నాదెళ్ల సూచించారు. అంటే.. కొద్ది కంపెనీలు మాత్రమే ఏఐని నియంత్రించే పరిస్థితి కాకుండా.. వివిధ దేశాలు, సంస్థలు, పరిశ్రమలు తమ సొంత ఏఐ సామర్థ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉండాలన్నారు. అప్పుడు మాత్రమే ఏఐ వల్ల వచ్చే ఆర్థిక ప్రయోజనాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరుతాయని అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా.. ఏఐ భవిష్యత్తుపై ఇతర సాంకేతిక దిగ్గజాలు కూడా ఆందోళనలు వ్యక్తం చేస్తున్నాయి. ఆంత్రోపిక్ సీఈవో డారియో అమోడీ ఇటీవల ఏఐ కారణంగా దీర్ఘకాలిక ఉద్యోగ నష్టాలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. ఏఐ మానవ మేధస్సుతో చేసే అనేక పనులను భర్తీ చేస్తే.. ఉద్యోగాలపై శాశ్వత ప్రభావం పడొచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. పరిస్థితి మరింత తీవ్రమైతే ప్రభుత్వాలు ఉద్యోగుల కోసం ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాల్సి రావచ్చని కూడా సూచించారు. మరోవైపు, ఎన్విడియా అధినేత జెన్సెన్ హువాంగ్ మాత్రం ఉద్యోగ కోతలన్నింటికీ ఏఐనే కారణమని చెప్పడం సరైంది కాదని వ్యాఖ్యానించారు. జనరేటివ్ ఏఐ అనేది విస్తృతంగా అందుబాటులోకి రాకముందే అనేక సంస్థలు ఉద్యోగులను తొలగించాయని గుర్తుచేశారు. ఉద్యోగాల కోత వెనుక ఆర్థిక పరిస్థితులు, వ్యాపార వ్యూహాలు, మార్కెట్ మార్పులు వంటి అనేక కారణాలు ఉంటాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఏఐపై ప్రపంచవ్యాప్తంగా చర్చ ఇప్పుడు కొత్త దశకు చేరుకుంది. ఒకవైపు అపార అవకాశాలు కనిపిస్తుంటే.. మరోవైపు ఉద్యోగాలు, వ్యాపారాలు, ఆర్థిక వ్యవస్థల భవిష్యత్తుపై ఆందోళనలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సత్య నాదెళ్ల చేసిన హెచ్చరిక ఒక కీలక ప్రశ్నను ముందుకు తెచ్చింది. ఏఐ మనిషిని మరింత శక్తివంతం చేసే సాధనంగా మారుతుందా? లేదంటే కొద్ది కంపెనీల చేతుల్లోనే శక్తిని కేంద్రీకరించి మిగతా ప్రపంచాన్ని ఆధారపడేలా చేస్తుందా? రానున్న దశాబ్దంలో ఈ ప్రశ్నకు దొరికే సమాధానమే ప్రపంచ భవిష్యత్తును నిర్ణయించే అవకాశం ఉంది.

# హమ్మయ్యా.. శాస్త్రవేత్తల భయం తప్పింది!

విశ్వంలో ఇంకా ఛేదించాల్సిన రహస్యాలు ఎన్నో ఉన్నాయి. అసలు విశ్వం ఎలా ఏర్పడింది? ఎంత పెద్దది? భవిష్యత్తులో ఎలా మారబోతోంది? వంటి ప్రశ్నలకు ఇప్పటికీ పూర్తి సమాధానాలు లేవు. అలాంటి సమయంలో ఓ అధ్యయనం బాంబును పేల్చింది. విశ్వం విస్తరణ వేగం తగ్గుతోందని.. దాన్ని ముందుకు నడిపిస్తోందని భావిస్తున్న 'డార్క్ ఎనర్జీ' సిద్ధాంతంలోనే లోపాలుండొచ్చని పేర్కొంది. దీంతో శాస్త్ర ప్రపంచంలో పెద్ద చర్చ మొదలైంది. అయితే తాజా పరిశోధన ఆ సందేహాలకు చెక్ పెట్టి పారేసింది. మన విశ్వం విస్తరిస్తోందని శాస్త్రవేత్తలకు చాలా కాలంగా తెలుసు. అయితే 1998లో జరిగిన పరిశోధనలు మరో కీలక విషయాన్ని వెల్లడించాయి. విశ్వం కేవలం విస్తరించడం మాత్రమే కాదు.. ఆ విస్తరణ వేగం కూడా క్రమంగా పెరుగుతోందని గుర్తించారు. ఈ ఆవిష్కరణకు గాను 2011లో భౌతిక శాస్త్ర నోబెల్ బహుమతి లభించింది. ఈ వేగవంతమైన విస్తరణ వెనుక పనిచేస్తున్న రహస్య శక్తినే శాస్త్రవేత్తలు "డార్క్ ఎనర్జీ"గా పిలుస్తున్నారు. అయితే అది అసలు ఏమిటో ఇప్పటికీ ఎవరికీ తెలియదు. విశ్వం ఎంత వేగంగా విస్తరిస్తోందో తెలుసుకోవడానికి శాస్త్రవేత్తలు టైప్-1ఏ సూపర్‌నోవా(ఎజూవ ఖు ాబజూవతీఅశీఖు) అనే ప్రత్యేక నక్షత్ర పేలుళ్లను పరిశీలిస్తారు. ఇవి దాదాపు ఒకే ప్రకాశంతో పేలుతుండటంతో వాటి దూరాన్ని కచ్చితంగా అంచనా వేయగలుగుతారు. ఈ లెక్కల ఆధారంగానే డార్క్ ఎనర్జీ ఉనికిపై శాస్త్రవేత్తలు నిర్ణయాలకు వస్తుంటారు. అయితే.. 2025లో దక్షిణ కొరియాకు చెందిన కొందరు పరిశోధకులు చేసిన అధ్యయనం శాస్త్ర ప్రపంచంలో పెద్ద చర్చకు దారితీసింది. ఇప్పటివరకు విశ్వ విస్తరణను కొలవడానికి ఉపయోగిస్తున్న పద్ధతుల్లో లోపాలుండొచ్చని, డార్క్ ఎనర్జీ పాత్రను తప్పుగా అర్థం చేసుకుని ఉండొచ్చని వాళ్లు వాదించారు. అంతేకాదు.. విశ్వ విస్తరణ వేగం పెరగడం లేదని, ఇప్పటివరకు వచ్చిన ఫలితాలు లెక్కల పొరపాట్ల వల్ల కనిపించి ఉండొచ్చని సూచించారు. దీంతో ఇన్నేళ్లుగా అంగీకరిస్తూ వచ్చిన సిద్ధాంతాలపై కొత్త సందేహాలు వ్యక్తమయ్యాయి. అయితే బ్రిటన్‌లోని సౌతాంప్టన్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు, నోబెల్ విజేతల బృందంతో కలిసి పాత డేటాను మరోసారి పరిశీలించారు. ముఖ్యంగా "టైప్-1ఏ సూపర్‌నోవా"లపై దృష్టి సారించారు. ఆపై కొరియా అధ్యయనంలో కొన్ని పొరపాట్లు ఉన్నాయని గుర్తించారు. ఒక గ్రామంలో 80 ఏళ్ల వృద్ధుడు ఉన్నాడనుకోండి. అదే గ్రామంలో 20 ఏళ్ల యువకుడు కూడా ఉంటాడు. గ్రామం 80 ఏళ్ల పాతది కాబట్టి అందరూ 80 ఏళ్లవాళ్లే అని చెప్పలేం కదా!. అలాగే ఒక గెలాక్సీ చాలా పురాతనమైనది కావచ్చు. కానీ అందులో ఉన్న ప్రతి నక్షత్రం కూడా అంతే పాతదని భావించలేం. 2025లో వచ్చిన అధ్యయనం గెలాక్సీ వయస్సునే అందులో పేలిన నక్షత్రం వయస్సుగా పరిగణించిందని, అక్కడే లెక్క తప్పిందని తాజా పరిశోధకులు చెబుతున్నారు. కాబట్టి విశ్వం ఇప్పటికీ వేగంగానే విస్తరిస్తోందని, డార్క్ ఎనర్జీ సిద్ధాంతం ఇప్పటికీ సరైనదేనని తేల్చారు.




### డార్క్ ఎనర్జీ అంటే..

సాధారణంగా మనకు కనిపించే నక్షత్రాలు, గ్రహాలు, గ్యాస్, ధూళి వంటి పదార్థం విశ్వంలో కేవలం 5 శాతం మాత్రమే ఉంటుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. మిగిలిన భాగంలో డార్క్ మ్యాటర్, డార్క్ ఎనర్జీ వంటి రహస్య అంశాలే ఎక్కువగా ఉన్నాయని భావిస్తున్నారు. అందులో డార్క్ ఎనర్జీ విశ్వాన్ని మరింత వేగంగా విస్తరించే శక్తిగా పనిచేస్తోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. తాజా అధ్యయనం డార్క్ ఎనర్జీ లేదన్న వాదనను కొట్టిపారేసినప్పటికీ.. అది అసలు ఏమిటి? ఎలా పనిచేస్తుంది? ఎక్కడి నుంచి వస్తుంది? అనే ప్రశ్నలకు మాత్రం ఇప్పటికీ సమాధానం లేదు. అంటే.. డార్క్ ఎనర్జీ ఉనికిపై శాస్త్రవేత్తలకు విశ్వాసం పెరిగింది గానీ, దాని అసలు స్వరూపం గుట్టుమాత్రం ఇంకా వీడాల్సి ఉందన్నమాట.

# 'మెటాలో ఇక భారీ తొలగింపులు ఉండకపోవచ్చు'





సోషల్ మీడియా దిగ్గజం మెటా కృత్రిమ మేధస్సు ఆధారిత సంస్థగా రూపాంతరం చెందే క్రమంలో ఉద్యోగులకు సంబంధించి కొన్ని పొరపాట్లు జరిగాయని దాని అధినేత మార్క్ జుకర్‌బర్గ్ అంగీకరించారు. అంతర్గత మెమోలో ఉద్యోగులను ఉద్దేశించి, వేగంగా మారుతున్న ఏఐ ప్రపంచంలో ఇలాంటి సవాళ్లు సహజమని జుకర్‌బర్గ్ పేర్కొన్నారు. "ఈ మార్పుల సంక్లిష్టత దృష్ట్యా మేము తప్పులు చేశాం. భవిష్యత్తులో కూడా కొన్ని తప్పిదాలు జరిగే అవకాశం ఉంది" అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం మెటా సంస్థ తన వ్యాపార వ్యూహాన్ని పూర్తిగా ఏఐ చుట్టూ పునర్వ్యవస్థీకరిస్తోంది. ఇందుకోసం డేటా సెంటర్లు, ఏఐ మౌలిక సదుపాయాలు, సూపర్ ఇంటెలిజెన్స్ ప్రాజెక్టులపై వందల బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడుతోంది. ఈ క్రమంలో సంస్థలో విస్తృత స్థాయి పునర్నిర్మాణం చేపట్టింది. మే నెలలో ప్రపంచవ్యాప్తంగా సుమారు 10 శాతం ఉద్యోగులను తొలగించగా, మరో 7,000 మంది ఉద్యోగులను ఏఐ సంబంధిత బృందాలకు బదిలీ చేసింది. అయితే ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనలను తగ్గించే ప్రయత్నంలో జుకర్‌బర్గ్ కీలక హామీ ఇచ్చారు. "ఈ ఏడాది సంస్థవ్యాప్తంగా మరోసారి భారీ స్థాయి ఉద్యోగ కోతలు ఉంటాయని మేము భావించడం లేదు" అని స్పష్టం చేశారు. ప్రపంచ పరిస్థితులు వేగంగా మారుతున్నందున అతిగా హామీలు ఇవ్వలేనప్పటికీ, సంస్థాగత స్థిరత్వాన్ని కాపాడటమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఏఐ మోడళ్ల శిక్షణ కోసం బదిలీ చేసిన ఉద్యోగులకు కొత్త అవకాశాలు కల్పించేందుకు సంస్థ కృషి చేస్తోందని ఆయన వెల్లడించారు. అవసరమైతే కొన్ని విభాగాల్లో తగ్గించిన సిబ్బందిని తిరిగి ఇతర బృందాలకు మార్చే అవకాశమూ ఉంటుందని చెప్పారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఉద్యోగుల నైపుణ్యాలను వినియోగించుకోవడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, మెటాలో జరిగిన ఏఐ ఆధారిత పునర్వ్యవస్థీకరణపై కొంత అసంతృప్తి కూడా వ్యక్తమవుతోంది. కొత్తగా ఏర్పాటైన ఏఐ విభాగాల్లో పని స్వరూపం, బాధ్యతలపై కొందరు ఉద్యోగులు అసహనం వ్యక్తం చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని పెంచేందుకు జూలైలో భారీ ఏఐ హ్యాకథాన్, టీమ్ ఈవెంట్లు నిర్వహించేందుకు సంస్థ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఏఐ పోటీలో ముందంజలో నిలవాలన్న లక్ష్యంతో మెటా దూసుకెళ్తున్నప్పటికీ, ఉద్యోగుల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం, సంస్థాగత మార్పులను సమతుల్యం చేయడం కంపెనీకి ఇప్పుడు అతిపెద్ద సవాలుగా మారింది.

## పవన్ కల్యాణ్ మాటలకు నా పీఏ కూడా స్పందించడు



**అమరావతి,:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై జై భీమ్ భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పవన్ కల్యాణ్ హావభావాలు, ఆయన మాట్లాడుతున్న విధానంపై సోషల్ మీడియాలో విపరీతంగా మీమ్స్, ట్రోల్స్ వస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఈ శతాబ్దపు మోస్ట్ కామిక్ పర్సన్ పవన్ కల్యాణ్ అని, ఆయన సినిమాల్లో కంటే నిజ జీవితంలోనే అత్యంత అద్భుతంగా నటిస్తున్నారని విమర్శించారు. పదిమందిలో మాట్లాడుతున్నామనే కనీస బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారని, ఆయన ఉప ముఖ్యమంత్రి కాకుండా ఉంటే ప్రెస్ మీట్లో ఆయన మాటలకు నా పీఏ కూడా స్పందించడని అన్నారు. అసలు ఆయన వెంట ఒక సామాజిక వర్గం కళ్లు మూసుకుని ఎలా నడుస్తుందో నాకు ఇప్పటికీ అర్థం కావడం లేదని అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గత రాజకీయాలను ప్రస్తావిస్తూ.. 2019 వరకు రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వమే అధికారంలో ఉందని, మరి దానిపై పవన్ కల్యాణ్ ఎందుకు నోరు మెదపలేదని శ్రవణ్ కుమార్ నిలదీశారు. ముఖ్యంగా సంచలనం రేపిన 'సుగాలి ప్రీతి' కేసును పవన్ డీల్ చేస్తున్న తీరుపై ఆయన లీగల్ పాయింట్స్ లేవనెత్తారు. సుగాలి ప్రీతి అసలు ఏ సంవత్సరంలో చనిపోయిందో కూడా కనీస అవగాహన లేకుండా పవన్ మాట్లాడుతున్నారని విమర్శించారు. గతంలో ఈ కేసు విషయంలో 'భౌభౌ' అని అరిచిన పవన్ కల్యాణ్ ఇప్పుడు అధికారంలోకి వచ్చాక మాట మారుస్తున్నారని జడ శ్రవణ్ మండిపడ్డారు. సుగాలి ప్రీతి కేసులో పోలీసులు సమర్పించిన ఛార్జ్‌షీట్‌లో అన్ని రకాల పక్కా ఆధారాలు ఉన్నాయని, కానీ పవన్ కల్యాణ్ మాత్రం ఆధారాలు లేవని అనడం వెనుక అసలు ఉద్దేశం ఏంటని శ్రవణ్ కుమార్ ప్రశ్నించారు. కేసుకు సంబంధించిన సాక్ష్యాధారాలన్నీ కోర్టులో అత్యంత భద్రంగా ఉన్నాయని అన్నారు. ఆధారాలు లేవంటూ నిందితులను కేసు నుంచి తప్పించాలని పవన్ చూస్తున్నారా..? అంటూ సూటిగా ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ అజ్ఞానాన్ని చూసి జనసేన నేతలు, కార్యకర్తలు తరించాలంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

## భువనగిరి కోటకు పర్యాటక హంగులు..
# రోప్‌వే, పార్కింగ్, హోటల్



**హైదరాబాద్, :** భువనగిరి కోట అభివృద్ధి పనులను అక్టోబర్ 2 లోగా పూర్తిచేయాలని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. సోమవారం కోట వద్ద పర్యటించిన ఆయన కొనసాగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. రోప్‌వే, హోటల్, పార్కింగ్, మరుగుదొడ్లు, చిన్నారుల ఆటస్థలం, కోట పునరుద్ధరణ పనులు, కేఫ్, ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్ సహా పర్యాటక సదుపాయాలను పరిశీలించారు. అవసరమైతే రాత్రింబవళ్లు పనులు చేపట్టి గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని జూపల్లి తెలిపారు. చారిత్రక వైభవాన్ని కాపాడుతూ భువనగిరి కోటను ఆధునిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. యాదాద్రి, భువనగిరి కోట, కొలనుపాకలను అనుసంధానిస్తూ సమగ్ర ఆధ్యాత్మిక -వారసత్వ పర్యాటక సర్క్యూట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద రూ.56.81 కోట్లతో 'భువనగిరి ఫోర్ట్ ఎక్స్‌పీరియెన్షియల్ జోన్' ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. ఇందులో రూ.17.91 కోట్లతో 1,020 మీటర్ల పొడవైన రోప్‌వే నిర్మిస్తున్నారు. గంటకు 250 నుంచి 300 మంది ప్రయాణికులు వినియోగించుకునే సామర్థ్యంతో ఈ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. మిగిలిన నిధులతో రహదారులు, పార్కింగ్, వీక్షణ గ్యాలరీ, కేఫ్, విద్యుదీకరణ, తాగునీటి సదుపాయాలు, సీసీ కెమెరాలు, భద్రతా వ్యవస్థలు, వారసత్వ కట్టడాల పునరుద్ధరణ వంటి పనులు చేపడుతున్నారు.

## రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములతో కూడిన వర్షం..
### - ఆరెంజ్ అలర్ట్ జారీ



**హైదరాబాద్, :** రాగల మూడు గంటల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో తేలికపాటి ఉరుములతో కూడిన వర్షం కురుస్తుందని తెలిపింది. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలో గంటకు 41-61కి.మీ. గాలి వేగంతో కూడి మోస్తరు ఉరుములతో కూడి వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. ఈ మేరకు మధ్యాహ్నం ఒంటి గంటకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ రిపోర్టు మధ్యాహ్నం నాలుగు గంటల వరకు వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఇక ఇవాళ ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లోల అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. నేడు మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మహబూబాబాద్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఎల్లుండి ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, నల్గొండ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. గురువారం నాడు ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

## ఏక్‌నాథ్ షిండే క్యాంపులో చేరిన
# ఆరు మంది సేన రెబల్ ఎంపీలు



ముంబై: అనుకున్నట్లే జరిగింది. ఉద్ధవ్ ఠాక్రే శివసేన వర్గానికి చెందిన ఆరు మంది ఎంపీలు ఏకనాథ్ షిండే వర్గానికి చెందిన శివసేన పార్టీలో చేరారు. ముంబైలో జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. ఉద్ధవ్ టీమ్‌లో మొత్తం 9 మంది ఎంపీలు ఉండగా, దాంట్లో ఇప్పుడు ఆరు మంది ఎంపీలు షిండే వర్గంలో చేరారు. దీంతో ఊహాగానాలకు బ్రేక్ పడింది. ఏక్‌నాథ్ వర్గంలో చేరిన ఎంపీల్లో ఓమ్‌రాజే నింబాల్కర్(ధారాశివ్), సంజయ్ దినా పాటిల్(ముంబై నార్త్ ఈస్ట్), సంజయ్ జాదవ్(పర్బని), సంజయ్ దేశ్‌ముక్(యవత్మాల్-వాసిమ్), నగేశ్ పాటిల్ అస్తికర్(హింగోలి), బౌసాహెబ్ వక్‌చౌరే(షిర్డి) ఉన్నారు. రెబల్స్ ఎంపీలే షిండే వర్గంలో చేరడంలో సేన యూబీటీ సంఖ్య కేవలం మూడుకు పడిపోయింది. పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని తప్పుకునేందుకు రెబల్స్‌కు మూడో వంతు మెజారిటీ కూడా ఉన్నది. ఆరు పులులు ఇక్కడే ఉన్నాయని, వాళ్లు ఇప్పుడు రియల్ శివసేన ఫ్యామిలీలో కలిశారని, రియల్ శివసేన ఫ్యామిలీకి వెల్కమ్ చెబుతున్నానని మహారాష్ట్ర డిప్యూటీ సీఎం షిండే తెలిపారు. శివసేన పార్టీని కాపాడుకునేందుకు గతంలో తాము రెబల్స్‌గా మారామని, ఇప్పుడు రెండో దశ ప్రారంభమైందన్నారు.

# అరణ్యారోదన



మన ప్రాచీనులు అడవులను దైవంగా ఆరాధించేవారు. అడవులను జీవజాలానికి ప్రాణాధారంగా చూసేవారు. అడవులను పవిత్ర తపోభూములుగా పరిగణించేవారు. అరణ్యాల ప్రస్తావన లేని పురాణేతిహాసాలేవీ మనకు లేవు. ఉద్యాన వర్ణన లేని ప్రబంధాలేవీ మనకు లేవు. అరణ్యకాండ లేని రామాయణాన్ని, అరణ్యపర్వం లేని మహాభారతాన్ని మనం ఊహించుకోలేం. ప్రాచీన వేదర్షులు సైతం వన ప్రాశస్త్యాన్ని ప్రస్తుతించారు. 'అంజనగంధిం సురభిం బహున్నామ కృషీవలామ్/ ప్రాహం మృగాణాం మాతరమరణ్యానిమశంసిషమ్' అని ఋగ్వేదంలోని 'అరణ్యాని సూక్తం' చెబుతోంది. అంటే, అంజనంలా సుగంధభరితమైనది, అనేక జంతువులకు తల్లివంటిది అయిన అరణ్యదేవతను స్తుతిస్తున్నాను అని అర్థం. 'దశకూప సమా వాపీ దశవాపీ సమో హ్రదః/ దశహ్రద సమః పుత్రో దశపుత్ర సమో ద్రుమః' అని 'పద్మపురాణం' చెబుతోంది. అంటే, పది బావులకు సమానం ఒక చెరువు, పది చెరువులకు సమానం ఒక సరస్సు, పది సరస్సులకు సమానం ఒక పుత్రుడు, పదిమంది పుత్రులకు సమానం ఒక వృక్షం అని అర్థం. 'అశ్వత్థమేకం పిచుమందమేకం న్యగ్రోధమేకం దశతింత్రిణీకం/ కపిత్థ బిల్వామలకత్రయాంచ పంచామ్రవాపీ నరకం న వశ్యేత్'-- రావిచెట్టు, వేపచెట్టు, మర్రిచెట్టు ఒక్కొక్కటి చొప్పున; పది చింతచెట్లు; మూడేసి వెలగచెట్లు, మారేడుచెట్లు, ఉసిరిచెట్లు; ఐదు మామిడిచెట్లు పెంచినవాడికి నరకం ఉండదు అని స్కాందపురాణం చెబుతోంది. వేద పురాణేతిహాసాలను గమనిస్తే, ప్రాచీనులు చెట్టు చేమలతో నిండిన అడవులకు ఎంతటి విలువనిచ్చేవారో అర్థమవుతుంది. ప్రాచీనకాలంలో రాజులు కూడా అడవుల సంరక్షణను బాధ్యతగా భావించేవారు. 'ద్రవ్యవనకర్మాంతాశ్చ ప్రయోజయేత్/ ద్రవ్యవనచ్ఛిదాం చ దండం కారయేత్' అని కౌటిల్యుడి అర్థశాస్త్రం చెబుతోంది. అంటే, అటవీ సంపదను సక్రమంగా వినియోగించాలి. అక్రమంగా అడవులను నరికివేసేవారిని శిక్షించాలి అని అర్థం. కౌటిల్యుడు 'అర్థశాస్త్రం'లో అభయవనాలు, హస్తివనాలు వంటి రకరకాల అడవుల సంరక్షణ కోసం పాటించవలసిన విధి విధానాలను వివరంగా చెప్పాడు. దాదాపు పదివేల ఏళ్ల కిందట-- నాగరికతలు మొదలైన కాలంలో భూమ్మీద దాదాపు అరవై శాతం అడవులే ఉండేవి. పద్దెనిమిదో శతాబ్దిలో పారిశ్రామిక విప్లవం మొదలయ్యేంత వరకు అడవుల పరిమాణం దాదాపు ఇదే స్థాయిలో ఉండేది. పారిశ్రామిక విప్లవం నాటి నుంచి అడవులు క్షీణించడం మొదలైంది. ఆధునికత, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ అడవుల విస్తీర్ణాన్ని కబళించడం మొదలైంది. ఇప్పుడు భూమ్మీద దాదాపు ముప్పయి శాతం అడవులు మాత్రమే మిగిలి ఉన్నాయి. పారిశ్రామిక విప్లవం నాటి నుంచి నేటి వరకు భూమ్మీద ఉన్న అడవుల విస్తీర్ణం సగానికి సగం క్షీణించి పోయింది. ప్రస్తుత శతాబ్ది మొదలైన తొలి ఇరవై ఏళ్లలోనే ఏకంగా ఆరు శాతం మేరకు అడవులు తరిగిపోయాయి. మన దేశంలోనైతే, స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు దాదాపు సగానికి సగం అడవులు అంతరించిపోయాయి. ఒకవైపు అడవుల విస్తీర్ణం తరిగిపోతుంటే, మరోవైపు మరుభూముల విస్తీర్ణం పెరుగుతోంది. గడచిన శతాబ్ద కాలంలో సహారా ఎడారి విస్తీర్ణం పది శాతం పెరిగింది. 'ఒక అడవిని సృష్టించడం కంటే ఒక ఎడారిని సృష్టించడం తేలిక కావడమే విచారకరం' అన్నాడు ఇంగ్లిష్ శాస్త్రవేత్త, పర్యావరణవేత్త జేమ్స్ లవ్‌లాక్. పనులు తేలిక చేసుకోవడానికి అలవాటుపడ్డ ఆధునికులు అడవులను సృష్టించే శ్రమ తీసుకోకుండా, తేలికగా ఎడారులను సృష్టించుకుంటున్నారు. అడవులు పుడమికి ఊపిరితిత్తులు. ఆధునిక మానవులు వాటికి తూట్లు పొడుస్తున్నారు. పర్యవసానంగా భూతాపం పెరిగి, మనుషులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మనుషులకు ఊపిరాడాలన్నా, సకాలంలో వానలు కురిసి పంటలు పండాలన్నా, ఇంకా ఈ భూమ్మీద మానవాళి మరిన్ని కాలాలపాటు మనుగడ సాగించాలన్నా, మనం ఇప్పటికైనా మేలుకొని అడవులను కాపాడుకోవాలి. అడవులన్నీ నశించాక మానవాళి చేసే ఆక్రందనలు అరణ్యారోదనలే అవుతాయి.

# నేరేడు విరగ కాస్తే కరువు తప్పదా?
# వాతావరణ మార్పులను ముందే పసిగట్టగలవా?



'ఈ ఏడాది నేరేడు చెట్లు అసాధారణంగా ఎక్కువ పండ్లు కాస్తున్నాయి. ఇది రాబోయే కరువుకు ప్రకృతి హెచ్చరిక' అని సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వాదన వెనుక శాస్త్రం ఏమి చెప్తున్నది? పెద్దల అనుభవాలు, అమ్మమ్మల పరిశీలనలు, స్ట్రెస్ ఫ్రూటింగ్, మాస్టింగ్ వంటి శాస్త్రీయ పదాలు కూడా జోడించటంతో ఇది మరింత నమ్మదగినట్టుగా కనిపిస్తున్నది. అయితే నిజంగా నేరేడు చెట్లు విరగకాస్తే కరువు వస్తుందా? చెట్లు భవిష్యత్తులో వచ్చే వాతావరణ మార్పులను ముందే పసిగట్టగలవా? నేరేడు చెట్లు ఈ ఏడాది నిజంగానే ఎక్కువ పండ్లు కాస్తున్నాయా? తెలంగాణ లోని కొన్ని ప్రాంతాల్లో రైతులు, గ్రామీణ ప్రజలు ఈసారి నేరేడు చెట్లపై పండ్లు సాధారణం కంటే ఎక్కువగా కనిపిస్తున్నాయని చెప్తున్నారు. ఇది పూర్తిగా కల్పితం కాదు. కానీ ఒక ప్రాంతంలో లేదా కొన్ని రాష్ట్రాల్లో ఎక్కువ పండ్లు కనిపించటం ద్వారా దేశవ్యాప్తంగా కరువు వస్తుందని చెప్పటం శాస్త్రీయంగా సరైన నిర్ధారణ కాదు. ప్రతి సంవత్సరం చెట్లలో పుష్పించటం, పండ్లు కాయటం అనేవి వర్షపాతం, ఉష్ణోగ్రతలు, నేలలో సారం, తేమ, చెట్టు ఆరోగ్యస్థితి, పరాగసంపర్కం వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటాయి. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న 'మాస్టింగ్' అనే పదం నిజంగానే వృక్షశాస్త్రంలో ఉన్నది. కొన్ని వృక్షజాతులు ప్రతి సంవత్సరం సమానంగా పండ్లు ఇవ్వవు. కొన్నేండ్లు తక్కువగా, మరికొన్నేండ్లు భారీగా ఉత్పత్తి చేస్తాయి. దీనినే 'మాస్టింగ్' అంటారు. ఓక్, పైన్, పనస, అనాస వంటి అనేక అడవి చెట్లలో ఈ లక్షణం కనిపిస్తుంది. దీనివల్ల కలిగే ప్రయోజనం ఏమిటంటే...ఒకేసారి భారీ సంఖ్యలో విత్తనాలు ఉత్పత్తి చేస్తే వాటిని పక్షులు, జంతువులు మొత్తం తినలేవు. ఫలితంగా కొన్ని విత్తనాలు నేలలో పడిపోయి కొత్త మొక్కలుగా ఎదుగుతాయి. అంటే 'మాస్టింగ్' అనేది ప్రకృతిలో జాతి మనుగడ కోసం ఏర్పడిన ఒక వ్యూహం. నిరుడు తూర్పుకనుమల్లో మేం తిరుగుతున్నపుడు చెట్లకు పనస పండ్లు విపరీతంగా వేలాడుతూ కొన్ని కుప్పలుగా నేలమీద రాలిపోవటం చూశాం. అలాగే పైనాపిల్ కూడా. 'ఈ కొండ ప్రాంతాల్లో ఊట నీటి వల్ల ఈ పండ్లు బాగా పండుతాయి. ఇలా పండటం వల్ల కరువు ఎపుడూ రాలేదు' అని అక్కడి రైతులు చెప్పారు. కొన్ని మొక్కలు లేదా చెట్లు తీవ్ర ఒత్తిడికి గురైనప్పుడు ఎక్కువ పూలు లేదా పండ్లు ఉత్పత్తి చేస్తుంటాయి. నీటి కొరత, అధిక ఉష్ణోగ్రతలు, చీడలు, వేర్లకు నష్టం వంటి పరిస్థితుల్లో కొన్ని మొక్కలు తమ జీవచక్రాన్ని వేగవంతం చేసి విత్తనాలను ఉత్పత్తి చేయటానికి ప్రయత్నిస్తాయి. భారతదేశంలో అత్యంత సహనశక్తి కలిగిన చెట్లలో నేరేడు ఒకటి. లోతైన వేర్లు ఉంటాయి. ఎండలను తట్టుకుంటుంది. తక్కువ నీటితో కూడా బతుకుతుంది. భూగర్భ జలాలను లోతుగా అందుకోగలదు. అందుకే నేరేడుచెట్టు పండ్లు ఎక్కువగా కాయటం అనేది తప్పనిసరిగా కరువు సంకేతం అని చెప్పలేం. ఈ ఏడాది ఎక్కువ పండ్లు ఎందుకు కనిపిస్తున్నాయి? దీనికి అనేక కారణాలు ఉండవచ్చు. చెట్టు గత సంవత్సరం నిల్వ చేసుకున్న శక్తిని ఈ ఏడాది పండ్ల రూపంలో వినియోగించి ఉండవచ్చు. కొన్ని చెట్లలో పుష్పోత్పత్తిని వేడి ప్రభావితం చేస్తుంది. కొన్నేండ్లకు ఒకసారి సహజంగానే భారీగా పండ్లు కాస్తుంటాయి. ఒక గ్రామంలో కనిపించిన పరిస్థితి రాష్ట్రమంతటా వర్తించకపోవచ్చు. నేరేడు చెట్లు ఎక్కువ పండ్లు కాస్తే కరువు వస్తుందనే వాదనకు ప్రత్యక్ష శాస్త్రీయ ఆధారాలు లేవు. అయితే, చెట్లు నీటి ఒత్తిడికి స్పందిస్తాయి. మాస్టింగ్, స్ట్రెస్ ఫ్రూటింగ్ వంటి ప్రక్రియలు నిజంగానే ఉన్నాయి. నేరేడు చెట్లు ఒక ముఖ్యమైన సందేశం మాత్రం ఇస్తాయి. అది ప్రకృతిలో జరుగుతున్న మార్పులను గమనించమని సూచిస్తాయి. భారత్‌లో వాతావరణ మార్పు ప్రభావాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎండలు పెరుగుతున్నాయి. భూగర్భ జలాలు తగ్గుతున్నాయి. వర్షాలు అస్థిరంగా మారుతున్నాయి. ఇలాంటి సమయంలో నేరేడు చెట్లు ఎక్కువ పండ్లు పండాయా? లేదా? అనేది కాదు, నీటిని ఎలా వినియోగిస్తున్నాం? భూగర్భ జలాలను ఎంత వేగంగా ఖాళీ చేస్తున్నాం? చెట్లను ఎంత మేరకు కాపాడుతున్నాం? అనేదే అసలు ప్రశ్న. ప్రకృతి సంకేతాలను గౌరవించాలి. కానీ వాటిని మూఢనమ్మకాలుగా కాకుండా శాస్త్రీయ అవగాహనతో అర్థం చేసుకోవాలి. అప్పుడే సంప్రదాయ జ్ఞానం, ఆధునిక శాస్త్రం కలిసి మన భవిష్యత్తును కాపాడుతాయి.

# 'గుర్తింపు' గండం!

### డోలాయమానంలో 5 లక్షల ఇంటర్ విద్యార్థులు
### అనుబంధ గుర్తింపు లేకున్నా.. ప్రైవేటు కాలేజీల్లో జోరుగా ప్రవేశాలు
### మే నెలాఖరుతోనే ముగిసిన అఫ్లియేషన్ల గడువు
### తనిఖీల నివేదికలు ఇచ్చామంటున్న జిల్లా అధికారులు
### బోర్డు బృందాలు మళ్లీ తనిఖీ చేయాల్సిందేనంటున్న కార్యదర్శి
### ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు



హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 5 లక్షల మంది ఇంటర్ విద్యార్థుల భవిష్యత్ గాలిలో ఊగిసలాడుతోంది. కాలేజీల్లో చేరినా వాటికి గుర్తింపు ఉందా? లేదా? అన్న డోలాయమానంలో పడిపోయారు. అన్ని జిల్లాల్లో ఈ అయోమయం నెలకొన్నా ఇంటర్మీడియెట్ బోర్డు ఏమాత్రం చలించడం లేదు. తెలంగాణ వ్యాప్తంగా 3,400 జూనియర్ కాలేజీలున్నాయి. ప్రైవేటు రంగంలో 1400. ప్రభుత్వ రంగంలో ఉన్న 800 కాలేజీలకు బోర్డు అనుబంధ గుర్తింపు ఇచ్చింది. ప్రైవేటు రంగంలో ఉన్న వాటిల్లో కేవలం 209కి మాత్రమే బోర్డు గుర్తింపు వచ్చింది. వెయ్యికి పైగా కాలేజీలకు అఫ్లియేషన్ ఎందుకు ఆపారో బోర్డు అధికారులు కూడా చెప్పలేకపోతున్నారు. ఈ విషయమై ప్రశ్నిస్తే 'చూస్తాం... ఇస్తాం... చేస్తాం...' అంటూ దాటవేస్తున్నారు. అనుబంధ గుర్తింపును ఏప్రిల్ నాటికే పూర్తి చేస్తామని గతంలో అధికారులు చెప్పారు. ఇంటర్ షెడ్యూల్ ప్రకారం చూసినా మే నెలాఖరుకే గుర్తింపు ఇవ్వాలి. ప్రైవేటు కాలేజీలను తనిఖీలు చేసి, నివేదికలను బోర్డుకు పంపామని జిల్లా అధికారులు కూడా చెబుతున్నారు. ప్రైవేటువే కాదు కొన్ని మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు, సంక్షేమ గురుకులాలకు కూడా బోర్డు అనుమతినివ్వలేదు.

**వాటిని ధ్రువీకరించేదెవరు?**


ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా కాలేజీలు అవసరమైన ధ్రువపత్రాలన్నీ సమర్పించాయి. అగ్నిమాపకశాఖ, శానిటేషన్, ట్రాఫిక్, భవన పటిష్టత వంటి పత్రాలను బోర్డుకు ఇచ్చాయి. వీటన్నింటినీ అధికారులు స్వయంగా పరిశీలించాలని ఇంటర్ కార్యదర్శి భావిస్తున్నట్టు తెలిసింది. క్షేత్రస్థాయి అధికారులు కాలేజీలతో కుమ్మక్కై వాటిని ధ్రువీకరించారనేది కార్యదర్శి అనుమానం. వాస్తవానికి బహుళ అంతస్తుల భవనాల్లో నడిచే కాలేజీలకు అగ్నిమాపక శాఖ ఎప్పట్నుంచో అనుమతి ఇవ్వొద్దని చెబుతోంది. పరీక్షలు దగ్గరపడే వరకూ అనుమతులూ ఇవ్వడం లేదు. ఆఖర్లో విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని అఫ్లియేషన్ ఇస్తున్నట్టు చెబుతున్నాయి.

**అఫ్లియేషన్ లేకున్నా అడ్మిషన్లు**

అనుబంధ గుర్తింపు లేకున్నా అన్ని కాలేజీలూ పెద్దఎత్తున విద్యార్థులను చేర్చుకున్నాయి. రూ. 80వేల నుంచి రూ. 4 లక్షల వరకూ వార్షిక ఫీజు దండుకున్నాయి. జూన్ 1 నుంచే క్లాసులు మొదలు పెట్టాయి. అయినా అధికారులు గుర్తింపులేని కాలేజీలను అడ్డుకునే సాహసం చేయడం లేదు. గుర్తింపు లేని కాలేజీల్లో ఇప్పటికే ఐదు లక్షల మంది చేరారు. గుర్తింపు ఉంటే తప్ప వీళ్లు వార్షిక పరీక్షలు రాసే అవకాశం ఉండదు. లేదంటే ప్రైవేటుగా పరీక్షలు రాయాలి. ఇంకోవైపు కార్పొరేట్ కాలేజీల మాయాజాలం యథాతథంగా సాగుతోంది. గుర్తింపు ఉన్న బ్రాంచీల్లో విద్యార్థుల ప్రవేశాలు చూపిస్తున్నారు. ఉదాహరణకు హైదరాబాద్ బ్రాంచీలో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య నిండినా చేర్చుకుంటున్నారు. వారి ప్రవేశాలను వరంగల్, ఖమ్మం లేదా ఆదిలాబాద్ బ్రాంచీల్లో చూపిస్తున్నారు. అక్కడ ప్రవేశాలు లేకపోవడమే వారికి కలిసి వస్తోంది. పెద్ద కాలేజీలు ఇంత బాహాటంగా వ్యవహరిస్తున్నా పట్టించుకోని అధికారులు తమకు మాత్రం అఫ్లియేషన్లు ఇవ్వకుండా వేధించడం ఏమిటని కొన్ని కాలేజీల నిర్వాహకులు ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంపై ఇంటర్ అధికారుల వివరణ కోరేందుకు యత్నించగా వారు స్పందించలేదు.

## మధ్యప్రాచ్య శాంతి కోసం కలిసి పనిచేద్దాం

- చైనా- రష్యాలు ప్రతిన



బీజింగ్ : మధ్యప్రాచ్య శాంతి కోసం రష్యా - చైనాలు ప్రతినబూనాయి. హర్మూజ్ జలసంధి మూసివేత అనంతం ప్రాంతీయ స్థిరత్వానికి, ఇంధన సరఫరా గొలుసుకు ప్రమాదం కలిగించే పరిస్థితిని ఖండించడానికి, ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఒత్తిడి తేవడానికి ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తమ పదవులను ఉపయోగించుకోవాలని రష్యా- చైనాలకు చెందిన ఇద్దరు దౌత్యవేత్తలు అంగీకరించారు. వ్యూహాత్మక అంశాలపై రష్యాతో నిరంతర సంప్రదింపులు కొనసాగించడానికి తమ దేశం సిద్ధంగా ఉందని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి తెలిపారు. రష్యా- చైనాలు చేసే ఉమ్మడి ప్రయత్నాల ద్వారా ప్రాంతీయ శాంతిని నెలకొల్పడం, స్థిరత్వాన్ని పరిరక్షించడమే తమ ప్రధాన లక్ష్యాలని వాంగ్‌యి అన్నారు. మధ్యప్రాచ్యంలో నెలకొన్న సంఘర్షణ విస్తరణను నివారించడానికి, ఈ ప్రాంతంలోని దేశాల సమగ్రతను కాపాడటానికి రెండు ప్రధాన శక్తులు కలిసి రావడం.. వాటి ప్రభావం చాలా కీలకం. ఈ నేపథ్యంలో రష్యా- చైనాలు ప్రాంతీయ శాంతికి, ఉద్రిక్తతలు తగ్గించడానికి ప్రయత్నిస్తున్నాయి.

## ఈస్టర్ నాడు నైజీరియాలోని రెండు చర్చిలపై దాడులు




అబుజా : ఈస్టర్ నాడు నైజీరియాలోని రెండు చర్చిలపై దుండగులు దాడులు జరపగా ఏడుగురు మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించి అవోన్ జిల్లా కౌన్సిలర్ మార్క్ బావా తెలిపిన వివరాల ప్రకారం.. మొదట నైజీరియాలో ప్రసిద్ధి చెందిన ఎసిడబ్ల్యు చర్చి, సెయింట్ అగస్టిన్స్ కాథలిక్ చర్చిలను గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి చుట్టుముట్టారు. చర్చికి వచ్చిన వారిపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల వల్ల ఏడుగురు మృతి చెందారు. గ్రామీణ ప్రాంతాల్లో టెలికమ్యూనికేషన్ల మౌలిక సదుపాయాలు సరిగ్గా లేకపోవడం వల్ల భద్రతా దళాలకు త్వరగా ఈ ఘటనకు సంబంధించిన సమాచారం అందలేదు. దీంతో దుండగులు రెచ్చిపోయారు. ఈ ఘటనపై నైజీరియా కాథలిక్ బిషప్స్ కాన్ఫరెన్స్ (సిబిసిఎన్) విచారం వ్యక్తం చేసింది. కాగా, ఈ ఘటనపై సిబిసిఎన్ అధ్యక్షుడు మాథ్యూ మ్యాన్-ఓసోన్డాగోసో విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన జరగడానికి పేలవమైన పాలన కారణమని ఆయన తీవ్రంగా ఆరోపించారు. స్వార్థం, బంధుప్రీతి, మతతత్వం, దేశ ఉమ్మడి శ్రేయస్సుపట్ల నిజమైన నిబద్ధత లేకపోడమే ఈ పరిస్థితి కారణమని ఆయన విమర్శించారు. నైజీరియాలోని మధ్య, వాయువ్య ప్రాంతాలలో నిరంతరం మతపరమైన దాడులు జరుగుతూనే ఉంటాయి. సాహెల్ ప్రావిన్స్‌లోని ఇస్లామిక్ స్టేట్‌తో సంబంధం ఉన్న గ్రూపుల చర్యల వల్ల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు.

## కార్పొరేట్ చట్టాల (సవరణ) బిల్లును ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ : లోక్‌సభలో కార్పొరేట్ చట్టాల (సవరణ) 2026 బిల్లును కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. సమగ్ర పరిశీలన కోసం ఈ బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి)కి పంపాలన్న తీర్మానాన్ని లోక్‌సభ ఆమోదించింది. ఈ బిల్లు పరిమిత బాధ్యత భాగస్వామ్య చట్టం 2008, కంపెనీల చట్టం 2013లకు మరిన్ని సవరణలను కోరుతోంది. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే 2026-27 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వ ఆర్థిక ప్రతిపాదనలను వివరించే ఫైనాన్స్ బిల్లు 2026ను కూడా పరిశీలన కోసం ఆర్థికమంత్రి ప్రవేశపెట్టనున్నారు. కాగా, నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కార్పొరేట్ చట్టాల (సవరణ) బిల్లును ప్రవేశపెట్టడానిన కాంగ్రెస్ ఎంపి మనీష్ తివారీ వ్యతిరేకించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 245-246ను ఉల్లంచి ఈ బిల్లులో ముఖ్యమైన శాసన విధులను మితిమీరి అప్పగించారు. కంపెనీల వర్గీకరణ, మినహాయింపులు, పాటించాల్సిన నిబంధనల నిర్ధారణ, కార్పొరేట్ సామాజిక బాధ్యతకు సంబంధించిన పరిమితి, ఆడిట్ బాధ్యతలు, జరిమానాల చట్రాలు వంటి కీలక విధానపరమైన అంశాలను తగిన శాసన మార్గదర్శకత్వం లేకుండా అనుబంధ శాసనలకు వదిలివేశారని మనీష్ తివారీ విమర్శించారు.

## ప్రపంచంలో 1970ల నాటికన్నా తీవ్రమైన చమురు సంక్షోభం



సిడ్నీ : 1970ల నాటి రెండు సంక్షోభాల కన్నా తీవ్రమైన చమురు సంక్షోభాన్ని ప్రపంచం ఎదుర్కొంటోందని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఇఎ) చీఫ్ ఫతిహ్ బిరోల్ హెచ్చరించారు. కాన్‌బెర్రాలోని నేషనల్ ప్రెస్ క్లబ్ ఆఫ్ ఆస్ట్రేలియాలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ యుద్ధం కారణంగా తలెత్తిన సంక్షోభం, 1973, 1979 నాటి చమురు సంక్షోభాలు మరియు 2022లో ఉక్రెయిన్‌పై రష్యా దాడి ఫలితంగా తలెత్తిన గ్యాస్ కొరతను కూడా మించిపోయిందని అన్నారు. వాస్తవ పరిస్థితుల ప్రకారం.. ఈ సంక్షోభం ప్రస్తుతం రెండు చమురు సంక్షోభాలు మరియు గ్యాస్ పతనం కలిసినట్లుగా ఉందని అన్నారు. హార్ముజ్ జలసంధిని మూసివేయడం మరియు ఇంధన సౌకర్యాలపై జరిగిన దాడుల కారణంగా ప్రపంచ చమురు సరఫరా రోజుకి సుమారు 11 మిలియన్ బ్యారెళ్ల (బిపిడి) మేర తగ్గిందని, ఇది 1970ల నాటి రెండు సంక్షోభాల కొరత కంటే రెట్టింపును దాటిందని బిరోల్ పేర్కొన్నారు. రష్యా ఉక్రెయిన్‌పై దాడి చేసిన అనంతరం ఏర్పడిన 75 బిలియన్ క్యూబిక్ మీటర్ల కొరతతో పోలిస్తే, లిక్విడ్ సహజవాయువు (ఎల్ఎన్‌జి) సరఫరా సుమారు 140 బిలియన్ క్యూబిక్ మీటర్ల మేర తగ్గిందని అన్నారు. తొమ్మిది దేశాల్లోని సుమారు 40 చమురు సౌకర్యాలు దెబ్బతిన్నాయని చెప్పారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అతిపెద్ద ముప్పును ఎదుర్కొంటుందని, వీలైనంత త్వరగా ఈసమస్య పరిష్కారమౌతుందని తాను ఆశిస్తున్నానని అన్నారు. అవసరమైతే వ్యూహాత్మక చమురు నిల్వలను విడుదల చేయాల్సిందిగా పలు దేశాలతో తాను చర్చిస్తున్నానని అన్నారు. అయితే ఈ సంక్షోభానికి ఏకైక అత్యంత ప్రధానమైన పరిష్కారం హార్ముజ్ జలసంధిని తెవరడమేనని స్పష్టం చేశారు.

## ప్రభుత్వ నియంత్రణ పరిధిలోకి ఇన్‌ఫ్లుయెన్సర్లు

## ఐటీ నిబంధనలకు సవరణలు ప్రతిపాదించిన కేంద్రం

## అమలైతే పోస్ట్ చేసే ప్రతి విషయంపై పెరగనున్న నిఘా

# రీల్ కూడా వార్తే..

వార్తలు, రాజకీయ సంబంధ అభిప్రాయాలను సోషల్ మీడియా వేదికగా పంచుకుంటున్నారా? రానున్న రోజుల్లో కాస్త జాగ్రత్తగా వ్యవహరించాల్సిందే. ఐటీ నిబంధనలు--2021కి కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ కొన్ని సవరణలను ప్రతిపాదించింది. ఇవి కార్యరూపంలోకి వస్తే యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను కూడా ప్రచురణకర్తలుగా పరిగణిస్తారు. అంటే వారు పోస్ట్ చేసే ప్రతి విషయంపై ప్రభుత్వ నిఘా, బాధ్యత పెరుగుతుంది.

క్రియేటర్లూ జాగ్రత్త..

వార్తలు, రాజకీయ సంబంధ పోస్టులను పంచుకునే యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లను ఇప్పటివరకు ప్రభుత్వం వార్తా సంస్థలుగా గుర్తించలేదు. దీనివల్ల టీవీ చానెళ్లకు ఉండే కఠిన నిబంధనలు వీరికి ఉండేవి కావు. ప్రతిపాదిత కొత్త సవరణల ప్రకారం ఏదైనా కంటెంట్‌ను 'తప్పు'అని ప్రభుత్వం భావిస్తే.. దాన్ని వెంటనే తొలగించే అధికారం ప్రభుత్వానికి పెరుగుతుంది. అంటే సోషల్ మీడియాలో పోస్ట్ చేసేటప్పుడు క్రియేటర్లు మరింత జాగ్రత్తగా ఉండాలి. లేదంటే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

### ఏమిటీ కొత్త ప్రతిపాదన?

సమాచార సాంకేతికత (మధ్యవర్తిత్వ మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా నైతిక నియమావళి) రెండో సవరణ నిబంధనలు--2026 కోసం కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ ఒక ముసాయిదాను విడుదల చేసింది. దీనిపై ఏప్రిల్ 14 వరకు ప్రజల అభిప్రాయాలను కోరింది. సురక్షితమైన ఇంటర్నెట్‌ను నిర్మించడమే దీని లక్ష్యమని ప్రభుత్వం చెబుతుండగా.. విమర్శకులు మాత్రం ఇది సామాన్యుల డిజిటల్ వాక్ స్వాతంత్ర్యంపై ప్రభుత్వానికి అపరిమితమైన కొత్త అధికారాలను కట్టబెడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్నెట్ ఫ్రీడమ్ ఫౌండేషన్ ఈ ముసాయిదా నిబంధనలను డిజిటల్ నియంతృత్వంగా అభివర్ణించింది.




### పరిధిలోకి ఎవరు వస్తారు?

ఈ సవరణలు యూట్యూబర్లు, ఇన్‌స్టాగామ్ రీల్స్ క్రియేటర్లు, 'ఎక్స్'యూజర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లతో సహా ప్రైవేట్ వ్యక్తులు పోస్ట్ చేసే వార్తలు, రాజకీయ అభిప్రాయాలతో కూడిన కంటెంట్ ఐటీ నిబంధనలలోని 'పార్ట్--3'పరిధిలోకి వస్తాయి. గతంలో వృత్తిపరమైన మీడియా సంస్థలకు మాత్రమే పరిమితమైన మూడంచెల పర్యవేక్షణ విధానం ఇకపై వీరికి కూడా వర్తిస్తుంది.

### కొత్త నిబంధన ఏమిటి?

ప్రభుత్వం జారీ చేసే లిఖితపూర్వక వివరణలు, సలహాలు, ఉత్తర్వులు, మార్గదర్శకాలను సోషల్ మీడియా సంస్థలు కచ్చితంగా పాటించాలి. ఏదైనా ప్లాట్‌ఫాం నిరాకరిస్తే వాటికి ఉన్న 'సేఫ్ హార్బర్'రక్షణను ప్రభుత్వం రద్దు చేస్తుంది. సాధారణంగా సోషల్ మీడియాలో ఎవరో ఒకరు తప్పుడు పోస్ట్ పెడితే దానికి ఆ సంస్థను బాధ్యులను చేయకూడదనేది సేఫ్ హార్బర్ నిబంధన ఉద్దేశం. ఈ రక్షణ పోతే యూజర్లు చేసే ప్రతి తప్పుకు లేదా పెట్టే ప్రతి వివాదాస్పద పోస్ట్‌కు సదరు కంపెనీయే బాధ్యత వహించాల్సి ఉంటుంది. దీనివల్ల కోర్టు కేసులు, భారీ జరిమానాలను ఎదుర్కోవాల్సి వస్తుంది.

### ఎంత సమయంలో తొలగించాలి?

నోటీసు అందిన 2--3 గంటల్లో ప్లాట్‌ఫాంలు సదరు కంటెంట్‌ను తొలగించాల్సి ఉంటుంది. 2021 నిబంధనల ప్రకారం గతంలో ఉన్న 24--36 గంటల సమయ పరిమితితో పోలిస్తే ఇది చాలా పెద్ద మార్పు.

### విస్తృత చర్యల్లో భాగమా?

ఈ ఏడాది ఫిబ్రవరిలో కేంద్రం డీప్‌ఫేక్స్, ఏఐ ద్వారా సృష్టించిన కంటెంట్‌పై కొన్ని నిబంధనలు తెచ్చింది. దీని ప్రకారం అలాంటి కంటెంట్ ఏఐతో రూపుదిద్దుకుందని లేబుల్ వేయడం, ఫిర్యాదు వచ్చిన వెంటనే త్వరగా తొలగించడం తప్పనిసరి చేశారు. ఇప్పుడు వస్తున్న కొత్త ఐటీ ప్రతిపాదన దీనికి తదుపరి దశ. ఆన్‌లైన్లో ప్రజలు మాట్లాడే లేదా పెట్టే పోస్టులపై ప్రభుత్వ పర్యవేక్షణను మరింత పటిష్టం చేయడం దీని ప్రధాన లక్ష్యం.

# నేపాల్‌లో మారిందేమిటి?!

తిరుగుబాటు గాలి ఒకచోట పుట్టి చప్పున చల్లారిపోదు. అది సమస్య ఉన్నచోటకల్లా పోయి నిప్పు రాజేస్తుంది. శ్రీలంకలో ప్రజా ఉద్యమానికి జడిసి పాలకులు పదవులూ, ప్యాలెస్‌లూ వదిలి నిష్క్రమించిన తరహాలోనే బంగ్లాదేశ్‌లో కూడా యువజనం ధాటికి 2024 ఆగస్టులో ప్రధాని షేక్ హసీనా రాజీనామా చేసి హుటాహుటీన న్యూఢిల్లీకి చేరుకుని ఆశ్రయం తీసుకోక తప్పలేదు. ఈ రెండింటినీ చూసి కావొచ్చు... నేపాల్‌లో సైతం జెన్ జీ తరం నిరుడు సెప్టెంబర్‌లో అధికార పీఠాలను కదిలించారు. అక్కడ జరిగిన ఎన్నికల్లో శ్రీలంక, బంగ్లాదేశ్‌లకు భిన్నంగా యువతరం రాజకీయాల్లోకొచ్చి విజయం సాధించారు. ప్రముఖ ర్యాపర్, కఠ్మాండు మేయర్ బాలేంద్ర షా ప్రధాని అయ్యారు. ఆయనతోపాటు అనేక కొత్త ముఖాలు పార్లమెంటులోకి అడుగుపెట్టాయి. ఆ రకంగా నేపాల్ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. కానీ మాజీ ప్రధాని, సీపీఎన్(యూఎంఎల్) అధినేత కేపీ శర్మ ఓలిని శుక్రవారం అరెస్టు చేయడాన్ని గమనిస్తే శ్రీలంక, బంగ్లాదేశ్‌ల మాదిరి కాకుండా గత పాలకుల్ని వేధించటమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు కనబడుతోంది. శ్రీలంకలో మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘేను నిరుడు అవినీతి ఆరోపణలపై అరెస్టు చేసిన సంగతి నిజమే అయినా, ఆ వెంటనే ఆయన బెయిల్‌పై విడుదలయ్యారు. బంగ్లాదేశ్‌లో అయితే వేధింపు రాజకీయాలకు తాను వ్యతిరేకమని కొత్త ప్రధాని తారిక్ రెహ్మాన్ ప్రకటించి ఇంతవరకూ విపక్ష నేతల జోలికి పోలేదు. హసీనాను తమకు అప్పగించాలని బంగ్లాదేశ్ ఇప్పటికీ భారత్‌ను కోరుతున్న మాట వాస్తవమే అయినా, అదే పనిగా పేచీకి దిగే ఉద్దేశం ప్రస్తుతానికైతే దానికి ఉన్నట్టు కనబడదు. నేపాల్‌లో నిరుడు సెప్టెంబర్‌లో జరిగిన నిరసనోద్యమంలో 77 మంది ప్రాణాలు బలిగొన్న భద్రతా బలగాల కాల్పులకు కారణమన్న కేసులో శర్మ ఓలిని, అప్పటి హోంమంత్రి రమేష్ లేఖక్‌లను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం జరిగిన నేపాల్ కొత్త కేబినెట్ తొలి సమావేశంలోనే ఈ నిర్ణయం తీసుకోవటం అందరినీ ఆశ్చర్యపరిచింది. ప్రత్యేక కోర్టు మాజీ న్యాయమూర్తి గౌరీ బహదూర్ కార్కీ నేతృత్వంలోని విచారణ కమిషన్ నివేదిక ఆధారంగా ఈ అరెస్టులు జరిగాయి. నిజానికి ఆ కమిషన్ ఓలి అపరాధాన్ని నిర్ధారించలేదు. కానీ కాల్పులను ఆయనగానీ, లేఖక్‌గానీ ఆపలేకపోయారని తెలిపింది. నేపాల్‌లో ఉద్యమకాలంలో జరిగిన హింస తక్కువేమీ కాదు. పార్లమెంటు ఆవరణలో, కోర్టుల్లో గుంపులు జొరబడి విధ్వంసానికి దిగాయి. 65 మంది రాజకీయ నాయకుల, పలు వ్యాపారవేత్తల ఇళ్లు, అన్ని పార్టీల కార్యాలయాలు, జైళ్లు ఉద్యమకారుల ధాటికి దెబ్బతిన్నాయి. అలాంటి సందర్భాల్లో ఏ దేశంలోనైనా భద్రతాదళాలు మౌనంగా ఉండగలవా? అయితే ప్రదర్శకులను చెదరగొట్టే ఉద్దేశంతోకాక వారి ప్రాణాలు తీయ టానికే కాల్పులు జరిపారన్న ఆరోపణలపై అన్ని కోణాల్లోనూ విచారణ జరిపి కారకుల్ని శిక్షించాల్సిందే. కానీ కక్ష తీర్చుకోవటమే ముఖ్యమన్నట్టు ప్రవర్తిస్తున్న తీరే ఆశ్చర్యం కలిగిస్తుంది. రిపబ్లిక్ గా ఏర్పడ్డాక నేపాల్‌లో జరిగిన పరిణామాలకు అన్ని పార్టీల నేతలూ బాధ్యులే. రాచరికాన్ని ప్రజలెందుకు తరిమికొట్టారో గ్రహించక ఫిరాయింపులతో ప్రభుత్వాలను పడగొట్టడం, అవినీతికి పాల్పడటం అక్కడి నాయకులకు రివాజయింది. వీటన్నిటినీ చూసి తీవ్రంగా కలతచెందబట్టే జెన్ జీ తరం జూలు విదిల్చింది. అదొక్కటే కారణం కాదు. యువత ఉపాధి లేమితో తీవ్ర ఇబ్బందులకు లోనవుతోంది. కొలువులు దొరక్క నైరాశ్యంలో కూరుకుపోతోంది. ఇక ఆశ్రిత పక్షపాతం, అవినీతి, ఆర్థిక వ్యత్యాసాలు సరేసరి. అత్యధిక శాతం యువత పిడికెడు మెతుకుల కోసం భారత్ సహా పలు దేశాలకు వలసపోవటం, ఎంతోకొంత మిగిల్చి కుటుంబాలకు పంపటం మామూలే. అలా పంపుతున్న డబ్బే నేపాల్ జీడీపీలో అధిక శాతం ఆక్రమిస్తోందంటే ఆశ్చర్యం కలుగుతుంది. తయారీరంగ పరిశ్రమలపైనా, ఇతర ప్రాజెక్టులపైనా దృష్టి కేంద్రీకరిస్తే తమ పిల్లలు ఇక్కడే స్థిరపడటానికి అవకాశం ఉంటుందని అనేకులు ఎదురు చూస్తున్నారు. ఈ దిశగా చర్యలు తీసుకోవటానికి బదులు కక్ష రాజకీయాలతోనే పాలనకు శ్రీకారం చుట్టి తాను గత పాలకులకు భిన్నమేమీ కాదని బాలేంద్ర షా నిరూపించారు. తిరుగుబాటు స్ఫూర్తికి ఇది విఘాతం కలిగిస్తుంది.



# ది న్యూ అడిక్షన్ ఎకానమీ.. మీ మెదడుపై అదృశ్య యుద్ధం!

ప్రపంచం మొత్తం మీ అరచేతిలో ఉందని మీరు సంబరపడుతున్నారా? కానీ వాస్తవానికి ఆ అరచేతిలో ఉన్న స్మార్ట్‌ఫోనే మిమ్మల్ని బందీని చేస్తోందని మీకు తెలుసా? సిలికాన్ వ్యాలీలోని టెక్ కంపెనీలు కేవలం సాఫ్ట్‌వేర్‌ను మాత్రమే తయారుచేయడం లేదు; అవి మన ప్రమేయం లేకుండానే మనల్ని బానిసలుగా మార్చే 'డిజిటల్ డ్రగ్స్'ను డిజైన్ చేస్తున్నాయి. దీనినే నిపుణులు 'అడిక్షన్ ఎకానమీ' అని పిలుస్తున్నారు.



### మీ సమయమే వారి పెట్టుబడి!

సాధారణంగా ఏదైనా వస్తువు కొనాలంటే మనం డబ్బులు చెల్లిస్తాం. కాని ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి యాప్స్ మనకు ఉచితంగా సేవలు అందిస్తున్నాయని మనం భ్రమపడుతుంటాం. ఒక వస్తువుకు మీరు డబ్బు చెల్లించడం లేదంటే, అక్కడ మీరే ఒక వస్తువు అని అర్థం. మీ సమయం, శ్రద్ధ, వ్యక్తిగత సమాచారమే వారి పెట్టుబడి. మీరు ఫోన్ చూస్తూ గడుపుతున్న ప్రతి అదనపు నిమిషం ఈ కంపెనీల పాలిట ఒక బంగారు గుడ్డు. మీరు ఎంత ఎక్కువ సమయం స్క్రీన్‌కు అతుక్కుపోతే, ఆ కంపెనీల షేర్ల విలువ అంతగా పెరుగుతుంది. 2026 ముగిసే నాటికి సోషల్ మీడియా యాడ్ మార్కెట్ సుమారు రూ.26 లక్షల కోట్లకు చేరుకోనుందంటే, మన ఏకాగ్రతను వారు ఎంత ఖరీదైన వస్తువుగా మార్చారో అర్థం చేసుకోవచ్చు. మెటా, గూగుల్ వంటి సంస్థలు రోజుకు వేల కోట్లు సంపాదిస్తున్నాయంటే, దానికి ఇంధనం మన మెదడులోని డోపమైన్, మన చేతిలోని సమయమే!

### దిగ్భ్రాంతికర గణాంకాలు

2025--26 నివేదికల ప్రకారం ఇటీవలి గణాంకాలు చూస్తుంటే మనం ఎంతటి ప్రమాదకర స్థితిలో ఉన్నామో అర్థమవుతుంది. సగటు భారతీయుడు రోజుకు దాదాపు 6.5 గంటల సమయాన్ని ఇంటర్నెట్‌పై గడుపుతున్నాడు. ఇందులో మూడు గంటల కంటే ఎక్కువ సమయం కేవలం వినోదం, సోషల్ మీడియాకే పరిమితం. ఒకప్పుడు మనుషుల్లో పన్నెండు సెకన్లుగా ఉన్న అటెన్షన్ స్పాన్, ఇప్పుడు ఎనిమిది సెకన్లకు పడిపోయింది. ఒక గోల్డెన్ ఫిష్ అటెన్షన్ స్పాన్ తొమ్మిది సెకన్లు. అంటే మనం దానికంటే ఘోరంగా ఉన్నామన్నమాట! రోజుకు ఐదుగంటల కన్నా ఎక్కువ స్క్రీన్ టైమ్ ఉన్న టీనేజర్లలో ఆత్మహత్య ఆలోచనలు లేదా తీవ్రమైన ఒత్తిడి వచ్చే అవకాశం 35 శాతం పెరిగినట్లు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ నివేదిక చెబుతోంది. ఆన్‌లైన్ గేమింగ్ అడిక్షన్ వల్ల 2025లో భారతీయ కుటుంబాలు దాదాపు 50 వేల కోట్ల రూపాయలకుపైగా నష్టపోయినట్లు అంచనా.

### బయటపడటం ఇలా...

ఈ 'అడిక్షన్ ఎకానమీ'లో మీ విలువైన జీవితాన్ని, సమయాన్ని తాకట్టు పెట్టకండి. ఈ రోజే మీ డిజిటల్ ప్రయాణాన్ని నియంత్రించుకోండి. స్మార్ట్‌ఫోన్ కంటే మీ స్మార్ట్‌నెస్ గొప్పదని నిరూపించండి! మీ ఫోన్ స్క్రీన్‌ను రంగులు లేకుండా 'బ్లాక్ అండ్ వైట్'లో మార్చండి. రంగులు లేకపోతే మెదడుకు ఆ దృశ్యాలు ఆకర్షణీయంగా అనిపించవు, తద్వారా ఫోన్ వాడకం 30 శాతం తగ్గుతుంది. ప్రతి 20 నిమిషాలకు ఒకసారి, 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును 20 సెకన్ల పాటు చూడండి. ఇది కంటి ఒత్తిడిని తగ్గించడమే కాకుండా, మెదడుకు చిన్న విరామాన్ని ఇస్తుంది. డైనింగ్ టేబుల్, బెడ్రూమ్‌లో ఫోన్‌ను అనుమతించకండి. ముఖ్యంగా నిద్రపోయే గంట ముందు ఫోన్‌ను పక్కన పెట్టడం వల్ల 'మెలటోనిన్' హార్మోన్ ఉత్పత్తి సక్రమంగా జరిగి గాఢ నిద్ర పడుతుంది. మీ ఫోన్లోని సెట్టింగ్స్‌లో 'డిజిటల్ వెల్--బీయింగ్' ఆప్షన్ ద్వారా ప్రతి యాప్‌కు సమయాన్ని కేటాయించుకోండి. సమయం ముగియగానే యాప్ లాక్ అయ్యేలా చూసుకోండి. ఖాళీ సమయం దొరకగానే ఫోన్ తీయకండి. ఆ ఖాళీ సమయాన్ని ఆలోచనల కోసం, ప్రకృతిని గమనించడం కోసం కేటాయించండి. సృజనాత్మకత ఎప్పుడూ ఖాళీ మెదడులోనే పుడుతుంది.

## నిందితుల్ని వదిలిపెట్టం.. అయోధ్య రామమందిరం విరాళాల స్కాంపై యూపీ సీఎం యోగి వార్నింగ్



న్యూఢిల్లీ,: ఉత్తర ప్రదేశ్, అయోధ్యలోని రామ మందిరంలో విరాళాలకు సంబంధించి అవకతవకలు జరిగినట్లు వెల్లడైన సంగతి తెలిసిందే. ఈ అంశంపై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ స్పందించారు. నిందితులు ఎలాంటివారైనా, ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదని సీఎం హెచ్చరించారు. యోగి ఆదిత్యనాథ్ శుక్రవారం అయోధ్యలో పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. రామ భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ప్రజలు ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దని ఆయన కోరారు. అలాగే, ఈ అంశంపై సిట్ దర్యాప్తు జరుపుతోందని, దీనికి సంబంధించి ఎవరివద్దనైనా ఆధారాలుంటే సిట్‌కు సమర్పించాలని ఆయన సూచించారు. ఆలయ ట్రస్ట్ వినతి మేరకు ఈ అంశంపై దర్యాప్తు జరిపేందుకు సిట్ ఏర్పాటు చేశామని, ఈ అంశంలోని విషయాల్ని సిట్ వెలుగులోకి తెస్తుందని భావిస్తున్నామని యోగి అన్నారు. భక్తులు కూడా ఆలయంపై జరుగుతున్న అనేక దుష్ప్రచారాలను నమ్మకుండా సహనంతో ఉండాలని, ఆలయ ప్రతిష్టకు భంగం కలిగించే ప్రయత్నాలకు దూరంగా ఉంటూ, రాముడికి సంబంధించి గౌరవం, సహనం కలిగి ఉండాలని భక్తులను కోరారు. రామాలయ ఉద్యమాన్ని కాంగ్రెస్, ఎస్పీలు అడ్డుకుంటున్నాయని, గత ప్రభుత్వాలు రామ భక్తులకు, కర సేవకులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకున్నారని యోగి గుర్తు చేశారు. గతంలో అయోధ్యలో రామాలయ నిర్మాణాన్ని అడ్డుకున్న కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు ఇక్కడి ఆలయంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు నటిస్తోందని, ఇది ఆ పార్టీ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం అన్నారు. రామాలయ ఉద్యమాన్ని కూడా కోర్టులో కాంగ్రెస్ పార్టీ అడ్డుకుందున్నారు. రామభక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయంటున్న సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) గతంలో కరసేవకులపై కాల్పులు జరపాలంటూ ఆదేశించిందని, జై శ్రీరామ్ అన్నవారిపై దళాల్ని ప్రయోగించిందంటూ యోగి విమర్శించారు. అయోధ్యలోని రామ మందిరానికి వచ్చిన విరాళాల విషయంలో అవకతవకలు, అక్రమాలు జరిగాయనే విషయం తాజాగా వెల్లడైంది. భక్తులు సమర్పించిన కానుకలు దేవాలయానికి చెందకుండా కొందరు సిబ్బంది కాజేశారని తేలింది. దీనిపై ప్రస్తుతం సిట్ దర్యాప్తునకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ విషయంలో కొన్ని ప్రాథమిక ఆధారాలు కూడా లభించాయి.

## నీట్ సూసైడ్ బాధిత కుటుంబాలకు కోటి పరిహారమివ్వండి: కాక్రోచ్ జనతా పార్టీ



న్యూఢిల్లీ: నీట్ పేపర్ లీకేజీ వల్ల కొందరు విద్యార్థులు మానసిక ఆందోళనకు గురవుతున్నారు. దేశవ్యాప్తంగా కొన్ని చోట్ల విద్యార్థులు ఆ టెన్షన్ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నారు. అయితే ఆ బాధిత కుటుంబీకులకు కోటి రూపాయలు పరిహారం ఇవ్వాలని కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే .. ప్రధాని మోదీకి లేఖ రాశారు. ప్రవేశ పరీక్షల వివాదాల వల్ల ఆందోళనకు గురై ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారాన్ని ఇవ్వాలని దీప్కే డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణపై విద్యార్థుల్లో ఆందోళన నెలకొన్నదని, దీని వల్ల ఆ విద్యార్థుల మానసిక ఆరోగ్యం క్షీణిస్తున్నట్లు దీప్కే తన లెటర్‌లో ఆరోపించారు. మరో వైపు జూన్ 20వ తేదీన కాక్రోచ్ జనతా పార్టీ భారీ స్థాయిలో రెండో నిరసన ప్రదర్శనకు సిద్ధం అవుతున్నది. భారమైన హృదయంతో లేఖ రాస్తున్నానని, మన భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారిన ఈ అంశంపై మీరు తక్షణమే స్పందించాలని దీప్కే తన లేఖలో ప్రధానిని కోరారు. మన విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని వేడుకున్నారు. ఇటీవల దేశవ్యాప్తంగా 11 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. రీ-ఎగ్జామ్‌పై అపనమ్మకం ఏర్పడడం వల్ల విద్యార్థుల్లో ఆందోళన ఎక్కువైందన్నారు. జీవితం మొత్తం కష్టపడి పిల్లలను చదవిస్తే, ఆ కుటుంబాలు ఇప్పుడు పిల్లల్ని కోల్పోతున్నాయని దీప్కే తన లెటర్‌లో ఆరోపించారరు. పరీక్షల వత్తిడి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారంగా కోటి ఇవ్వాలని దీప్కే డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలని కోరారు. మరో వైపు జూన్ 21వ తేదీన నీట్-రీఎగ్జామ్‌ను నిర్వహించనున్న విషయం తెలిసిందే.

## వైఎస్సార్‌సీపీ పిటిషన్‌పై స్పందించిన హైకోర్టు

### ఫేస్‌బుక్ ఖాతా నిలిపివేయడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, మెటాకు నోటీసులు



అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారిక ఫేస్‌బుక్ ఖాతాను చంద్రబాబు ప్రభుత్వం కుట్రపూరితంగా బ్లాక్ చేయించడంపై హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు మెటా సంస్థను ఆదేశించింది. వారికి నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వారిని ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ లీసా గిల్, జస్టిస్ రఘునందన్‌రావు ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. తమ పార్టీ అధికార ఫేస్‌బుక్ అకౌంట్‌ను బ్లాక్ చేయడాన్ని సవాలు చేస్తూ వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై గురువారం సీజే ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సుబ్రమణ్య శ్రీరామ్ వాదనలు వినిపించారు. వైఎస్సార్‌సీపీ ఫేస్‌బుక్ అకౌంట్‌ను ఏకపక్షంగా బ్లాక్ చేశారని తెలిపారు. ఎవరు ఆదేశిస్తే బ్లాక్ చేశారో చెప్పడం లేదన్నారు. ఎలాంటి నోటీసు కూడా ఇవ్వలేదని తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంలో మెటా ఏకపక్షంగా వ్యవహరించిందని ఆయన వివరించారు. ఐటీ చట్ట నిబంధనలను కాలరాసిందని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణను ఆగస్ట్ 13కు వాయిదా వేసింది.

## గాంధీ సరోవర్‌కు రక్షణశాఖ గ్రీన్ సిగ్నల్.. రేవంత్ రెడ్డి ధన్యవాదాలు



హైదరాబాద్: గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినందుకు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రక్షణ మంత్రిత్వ శాఖ సహకారానికి తెలంగాణ ప్రభుత్వం తరుపున ధన్యవాదాలని పేర్కొన్నారు. మూసీ పునరుజ్జీవనలో గాంధీ సరోవర్ ప్రాజెక్టు కీలక మైలురాయిగా భావిస్తున్నామని .మూసీ పరివాహక ప్రాంతాన్ని సాంస్కృతిక ప్రజా వారసత్వ ఆస్తిగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తేల్చిచెప్పారు. ఈ సందర్భంగా భారత రక్షణ శాఖ, భారత సైన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ బాపూ ఘాట్ వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్టు నిర్మించబోతుంది.

# దాహార్తిని తీర్చే ప్రణాళికలేవి?



సంక్షోభాలు అకారణంగా రావు. అంచనాలున్నప్పుడూ, సమస్య అంతకంతకు ఉగ్ర రూపం దాలుస్తున్న వైనం కనబడుతున్నప్పుడూ మేల్కొంటే సకాలంలో వాటిని నివారించటం, అధిగమించటం వీలవుతుంది. కానీ మన పాలకుల విధానాలన్నీ దాహం వేసిన ప్పుడు బావి తవ్విన చందాన ఉంటున్నాయి. అందువల్లే ఈ వేసవిలో దేశంలోని మహా నగరాలన్నీ కనీ వినీ ఎరుగని నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. ప్రపంచ జనాభాలో మన వాటా 18 శాతం. కానీ ప్రపంచ నీటి వనరుల్లో వాటా కేవలం 4 శాతం మాత్రమే. ఇంత వ్యత్యాసం ఉన్నప్పుడు నీటి వనరుల సంరక్షణ విషయంలో మొదటినుంచీ ఎంత జాగ్రత్తగా ఉండాలో చెప్పనవసరం లేదు. వాతావరణ మార్పులు ఒక్కటే కాదు... భూగర్భ జలాల వినియోగంలో జాగ్రత్తలు పాటించకపోవటం, నగర పట్టణ ప్రాంతాల్లో నీటిని కాస్తయినా పట్టింపు లేకుండా వృథా చేయటం వంటివి సైతం సమస్యను ఉగ్ర రూపం దాల్చేలా చేస్తున్నాయి. ప్రపంచం నీటి కొరత, ఎద్దడి, సంక్షోభం దశల్ని దాటి ఇప్పుడు నీటి దివాలా(పునరుత్పాదకతకు వీల్లేనివిధంగా పూర్తిగా అడుగంటడం) వరకూ వచ్చిందని ఐక్యరాజ్యసమితి విశ్వవిద్యాలయ జల, పర్యావరణ, ఆరోగ్య సంస్థ ఈమధ్య ప్రకటించింది. అయితే దీన్నుంచి తప్పించుకోవటానికి ఇప్పటికీ మార్గాలున్నాయి. గండం గట్టెక్కడానికి తోచినవిధంగా చేసుకుపోవటం బదులు పారదర్శక విధానాలు పాటించటం అవసరమని ఆ సంస్థ సూచించింది. ఒక ప్రణాళికాబద్ధంగా సహజ నీటివనరుల రీచార్జ్‌కి అనుసరించాల్సిన మార్గాలేమిటో నిర్ధారించుకోవటం, వాగులు, వంకలు, జలాశ యాలు నిండటానికి దోహదపడే కొండలు, గుట్టల్ని ప్రాణప్రదంగా కాపాడుకోవటం అవసరమని నిపుణులంటున్నారు. ప్రపంచంలో 70 శాతం జలాశయాలు క్రమేపీ క్షీణిస్తు న్నాయనీ, 400 కోట్లమంది ప్రజలు ఏడాదిలో కనీసం ఒక నెలపాటు నీటి ఎద్దడి ఎదు ర్కొంటున్నారనీ సమితి విశ్వవిద్యాలయం అంటున్నది. తీవ్ర నీటి కొరత ఎదుర్కొంటున్న నగరాల్లో ఢిల్లీ, కోల్‌కతా చెన్నై, బెంగళూరులతోపాటు హైదరాబాద్ కూడా ఉంది. ఈ నీటి కొరత ప్రజారోగ్యానికి కూడా ముప్పు కలిగిస్తోంది. 14 యేళ్లలోపున్న 80 లక్షల మంది బాలలు తాగునీటి నాణ్యత నాసిరకంగా ఉండటంవల్ల అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని సంస్థ నివేదిక చెబుతోంది. నీటి ఎద్దడిని వర్షాలు సరిగా పడకపోతే వచ్చే సమస్యగానే ఇంకా మన పాలకులు చూస్తున్నారు. కానీ సరిగా అధ్యయనం చేస్తే దీని మూలాలు మరెక్కడో ఉన్నాయని అర్థమవుతుంది. నగరాలు తమ స్థోమతకు మించి విస్తరిస్తున్నాయి. అంతో ఇంతో ఉపాధి కల్పించే సంస్థలన్నీ అక్కడే కేంద్రీకృతం కావటంతో అనివార్యంగా అందరూ నగరాల బాట పట్టాల్సివస్తోంది. కానీ మౌలిక సదుపాయాలు ఇంతమందిని తట్టుకోగల స్థాయిలో లేక సహజంగానే సంక్షోభం ముదురుతుంది. ఉన్న నీటి వనరులేమిటి... వాటి సమర్థ వినియోగానికి మార్గాలేమిటన్న అంశాలపైకాక, కొత్త వనరుల అన్వేషణపై దృష్టి కేంద్రీకరించటం సమస్య తీవ్రతను పెంచుతోంది. భూగర్భ జలాల వినియోగంపై నియంత్రణలు, వ్యర్థ జలాల శుద్ధి అంశాల్లో ప్రభుత్వాలకు సరైన ప్రణాళికలు లేవు. వ్యర్థ జలాలు, పారిశ్రామిక వ్యర్థాలు చెరువుల్లో, నదుల్లో కలుస్తున్నా పట్టకపోవటంతో చివరకు భూగర్భజలాలు కూడా కలుషితమవుతున్నాయి. వచ్చే 2030 నాటికి అందుబాటులో ఉండే నీటి లభ్యతతో పోలిస్తే రెండు రెట్లు అధిక డిమాండ్ ఉంటుందని నీతి ఆయోగ్ సంస్థ చెబుతున్న జోస్యం అందరినీ భయపెడుతోంది. మూడు నాలుగు నెలలపాటు ఉండాల్సిన రుతుపవనాలు చుట్టం చూపుగా వచ్చి పోవటం రివాజుగామారి చాన్నాళ్లవుతోంది. ఈసారి ముంచుకొస్తున్న సూపర్ ఎల్‌నినో సరేసరి. గంగ, సింధు, బ్రహ్మపుత్ర నదులను నింపే హిమాలయాల్లోని మంచుదిబ్బలు వేగంగా కరుగుతూ వెంటనే వరదలకూ, అటుపై నీటి కొరతకూ కారణమవుతున్నాయి. అందుకే చైనా, సింగపూర్ వంటి దేశాలు నీటి వనరుల రక్షణకూ, వాన నీటి సేకరణకూ, వ్యర్థ జలాల వినియోగానికీ అనుసరించే విధానాలను అధ్యయనం చేసి మన దగ్గర కూడా అమలు చేయాలి. నీటి వినియోగంపై సమగ్రమైన నిబంధనలకు రూపకల్పన చేయాలి. వానాకాలంలో వరదల్లో మునిగి, వేసవిలో ఎడారులుగా మారే నగరాలు మనకొద్దని ప్రతినబూనాలి.

# ఎట్టకేలకు శాంతి దిశగా...



అమెరికా--ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం ఖరారు దిశగా తొలి అడుగు పడింది. ఫ్రాన్స్‌లోని ప్యాలెస్ ఆఫ్ వెర్సాయ్‌లో ఈ ఒప్పందానికి సంబంధించిన అవగాహన పత్రం (ఎంఓయూ)పై స్థానిక కాలమానం ప్రకారం బుధవారం రాత్రి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సంతకాలు చేశారు. ఇద్దరూ పరస్పరం వేల కిలోమీటర్ల దూరంలో ఉండి ఈ తంతు ముగించడాన్నిబట్టే ఆ రెండు దేశాలమధ్యా ఉన్న వైషమ్యాల తీవ్రతేమిటో తెలుస్తుంది. మొదట ట్రంప్ సంతకం చేసి ఆన్‌లైన్‌లో పంపిన ఎంఓయూ నకలు తీసుకుని దానిపై పెజెష్కియాన్ సంతకం చేశారు. ఈ వారం ఆఖరులో జెనీవాలో ఈ సంతకాల కార్యక్రమం ఉంటుందని తొలుత ప్రకటించినా, ఎందుకనో అంతా మారింది. అనుసరించిన విధానం ఏమైనా, ఇకపై పశ్చిమాసియా ప్రశాంతంగా ఉంటే అదే పదివేలని ప్రపంచ ప్రజానీకమంతా ఆరాట పడుతున్నది. తుది ఒప్పందానికి రావటం కోసం రాగల అరవై రోజుల వ్యవధిలో అమెరికా, ఇరాన్ రెండూ ఏమేం చేయాలో ఈ 14 అంశాల ఎంఓయూలో ఉంది. ఇతరత్రా అంశాల మాటెలావున్నా హార్మూజ్ ప్రతిష్ఠంభనకు తెరపడటం, అణ్వాయుధాల జోలికిపోనని ఇరాన్ హామీ ఇవ్వటం ప్రధానమైనవి. లెబనాన్‌లో ఇజ్రాయెల్ సాగించే హత్యాకాండను ఆపటంతోసహా అన్ని రకాల యుద్ధాలూ పరిసమాప్తం చేయటం, ఇరాన్ పునర్నిర్మాణానికి అమెరికా, ఈ ప్రాంత భాగస్వామ్య దేశాలూ 30,000 కోట్ల డాలర్ల నిధిని సమకూర్చటం, ఇరాన్ చమురు విక్రయాలపై అమెరికా ఆంక్షల తొలగింపుపై విధివిధానాలు వెల్లడించటం కూడా ఇందులో భాగమే. 30 రోజుల్లో ఇరాన్ సమీపంలోని అమెరికా నౌకలన్నీ నిష్క్రమిస్తాయనీ, యుద్ధ ప్రారంభానికి ముందున్న పరిస్థితులు పునరుద్ధరిస్తారనీ ఎంఓయూ చెబుతోంది. అయితే ఇప్పటికే 60 శాతం అభివృద్ధి చేసిన యురేనియం విషయంలో ఇరాన్ ఏం చేయాలో ఇరు దేశాలూ చర్చించుకుంటాయి. ఇజ్రాయెల్‌తో కుమ్మక్కయి అకారణంగా, ఏకపక్షంగా ప్రారంభించిన ఈ యుద్ధాన్ని ఎటు తీసుకుపోవాలో, 'గౌరవప్రదంగా' ఎలా బయటపడాలో దిక్కుతోచని అమెరికాకు ఇప్పుడు అన్నివిధాలా గర్వభంగమైంది. చిత్రమేమంటే... ఒకే లక్ష్యంతో ఈ ఊబిలోకి దిగిన మిత్రులు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూలిద్దరికీ కొద్ది రోజుల్లోనే మార్గాలు వేరయ్యాయి. ఈ యుద్ధాన్ని తక్షణం వదుల్చుకుంటే తప్ప ఏడాది ఆఖరుకల్లా దేశంలో జరిగే మధ్యంతర ఎన్నికల్లో తుడిచిపెట్టుకుపోవటం ఖాయమని ట్రంప్‌కు అర్థమైతే... ఇది కొనసాగుతుంటే తప్ప ఏడాది చివరన జరిగే పార్లమెంటు ఎన్నికల్లో గెలుపు అసాధ్యమని నెతన్యాహూ లెక్కలేసుకున్నారు. ఆయన సమస్యేమిటో ట్రంప్‌కు తెలియకపోలేదు. కానీ మిత్రత్వం కంటే స్వీయ పీఠ సంరక్షణే ప్రధానమని ఆయన గ్రహించారు. అందుకే విధి లేని స్థితిలో ఈ ఒప్పందానికొచ్చారు. హార్మూజ్ మూతతో అమెరికాలో గ్యాసోలిన్ ధరలు మిన్నంటాయి. ద్రవ్యోల్బణం హద్దులు దాటింది. సరుకుల కొరత ఏర్పడింది. ఒబామా హయంలో ఇంతకంటే మెరుగ్గా కుదిరిన ఒప్పందాన్ని బుట్టదాఖలు చేసిన ట్రంప్, దీనికెలా అంగీకరించారన్న కథనం ఆసక్తికరమైనది. దౌత్యంలో దేశాల అధినేతలు అవతలి పక్ష సైనిక, ఆర్థిక, భౌగోళిక రాజకీయ స్థితిగతుల్ని విశ్లేషించగల నిపుణుల సాయం తీసుకుంటారని చెబుతారు. కానీ ఇరాన్ మరో అడుగు ముందుకేసి మానసిక ఆరోగ్య నిపుణుల్ని కూడా ఇందులో చేర్చిందంటున్నారు. ట్రంప్ ప్రకటనల్ని, క్షణక్షణానికి మారే ఆయన వైఖరుల్ని గమనిస్తూ ఎలా మాట్లాడితే బోధపరుచుకుని సానుకూలంగా స్పందిస్తాడో వారు సలహాలిచ్చారని దాని సారాంశం. ట్రంప్ తీరుతెన్నులు గమనిస్తే అది నిజమే అనిపిస్తుంది. తన కనుసన్నల్లో ఖరారైన ఎంఓయూ తనకి నచ్చకుంటే మళ్లీ బాంబులేయటానికి వెనకాడనని ఆయనే చెప్పటాన్ని గమనిస్తే ట్రంప్‌ను ఇరాన్ సరిగానే అంచనా వేసిందనుకోవాలి. పారిస్ వెలుపలనున్న ప్యాలెస్ ఆఫ్ వెర్సాయ్ రాచరిక ఉత్థాన పతనాలు చూసింది. ఫ్రెంచ్ విప్లవాన్నీ, దానిలోని ప్రజాస్వామిక ఆకాంక్షలనూ గమనించింది. 1783లో బ్రిటన్, ఫ్రాన్స్, స్పెయిన్‌ల సరిహద్దు తగాదాలపై ఒడంబడికకు సాక్షిగా నిలిచింది. జర్మనీని అవమానకరమైన ఒప్పందంతో శాసించి, 1919లో మొదటి ప్రపంచ యుద్ధాన్ని ముగించిందీ ఇక్కడే. కానీ అమెరికాకు ఇప్పుడెదురైన అవమానం స్వచ్ఛందం, స్వయంకృతం. ఇన్నింటికి వేదికైన చోట కుదిరిన ఈ ఎంఓయూను ట్రంప్ గౌరవిస్తారని ఆశించాలి.

# ఖరీఫ్‌కు ముందే కష్టాలు!

యాసంగి సన్న ధాన్యానికి రావాల్సిన బోనస్‌లో రూ.700 కోట్లు ఇప్పటికీ రాలేదు.. ఇంతలో ప్రభుత్వం గుర్తించిన 7 రకాల వరి వంగడాలకే ఈసారి బోనస్ పరిమితమంటూ ప్రకటించింది. మరి.. ఆ రూ.700 కోట్లు ఇక రానట్టేనా? యాసంగి రైతు భరోసా రూ.9 వేల కోట్లు అని చెప్పినా.. అది రూ. 5,653 కోట్లకే పరిమిత మైంది.. ఈ నెల 30న ఈ ఖరీఫ్ రైతు భరోసా నిధులు జమచేస్తామంటూ కేబినెట్ భేటీ అనంతరం సర్కారు ప్రకటించింది.యాసంగి రైతు భరోసాకు మంగళం పాడినట్టేనా?



### అన్నదాతల అవస్థలు..

రైతన్నకు దెబ్బమీద దెబ్బ పడుతోంది. ఇప్పటికే పెరిగిన ఎరువుల ధరలు, ట్రాక్టర్ అద్దెల భారం, కూలీల కొరత, ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ హెచ్చరికలు అన్నదాతను ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా.. వీటికి తాజా కష్టాలు తోడయ్యాయి. అటు రైతు బీమాలో భాగంగా ఎల్ఐసీకి ప్రీమియం చెల్లింపులో ఆలస్యం జరగడంతో అన్నదాతల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి.

### ఏడు రకాల వరికే బోనస్

గత రెండేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం సన్న ధాన్యం సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహించింది. ప్రజలకు సన్నబియ్యం పంపిణీ, రైతులకు అదనపు ఆదాయం అనే లక్ష్యాలతో క్వింటాల్‌కు రూ.500 బోనస్‌ను ప్రకటించింది. ప్రభుత్వం ఇచ్చిన భరోసాతో లక్షలాది మంది రైతులు దొడ్డు బియ్యం స్థానంలో సన్నాల సాగుకు మొగ్గు చూపారు. యాసంగి సీజన్‌లో ఉత్తర తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో సన్నాలకు వాతావరణం అనుకూలించకపోయినా వ్యయ ప్రయాసల కోర్చి రైతులు పెద్ద ఎత్తున సాగు చేశారు. అయితే గత యాసంగిలో కొనుగోలు చేసిన దాదాపు 14 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యానికి సంబంధించిన బోనస్ సుమారు రూ.700 కోట్లు ఇప్పటికీ రైతుల ఖాతాల్లో జమ కాలేదు. వానాకాలం సీజన్ రావడంతో ఇక యాసంగి బోనస్‌ను వదులుకున్నట్టే. 2024--25 యాసంగిలో కూడా దాదాపు 24 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యాన్ని విక్రయించిన రైతులకు చెల్లించాల్సిన బోనస్ రూ.1,159 కోట్లను ఇవ్వలేదు. కాగా, ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం రైతాంగాన్ని ఆందోళనకు గురి చేస్తోంది. ఇకపై ప్రభుత్వం గుర్తించిన ఏడు రకాల వరి వంగడాలకు మాత్రమే బోనస్ వర్తిస్తుందని సర్కారు ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ అంచనా ప్రకారం 38.19 లక్షల ఎకరాల్లో ఈ ఏడు రకాల సన్నాలను సాగు చేయనున్నారు. దీనికి అవసరమైన విత్తనాల పరిమాణం 9.55 లక్షల క్వింటాళ్లుగా పేర్కొన్న ప్రభుత్వం.. 15.64 లక్షల క్వింటాళ్లు అందుబాటులో ఉన్నట్టు చెబుతోంది. అయితే అందులో దాదాపు 13 లక్షల క్వింటాళ్ల విత్తనాలు ప్రైవేట్ వ్యాపారుల వద్దనే ఉండడం గమనార్హం. ఇందులో ఇప్పటికే 2 లక్షల క్వింటాళ్లను రైతులకు విక్రయించినట్టు వ్యవసాయశాఖ తాజా నివేదికలో వెల్లడించింది. తెలంగాణ సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వద్ద కేవలం నాలుగు రకాల విత్తనాలు 38 వేల క్వింటాళ్లు మాత్రమే ఉండగా, జాతీయ విత్తన సంస్థ (ఎన్ఎస్‌సీ) వద్ద కేవలం 4,838 క్వింటాళ్లు మాత్రమే ఉన్నాయి. రైతులు సన్నాల కోసం ప్రైవేటు వ్యాపారుల వద్దకు వెళ్లక తప్పని పరిస్థితి ఏర్పడింది.

### రైతుబీమా ఆలస్యం...

రైతు బీమా డబ్బు అందక వేలాది కుటుంబాలు ఆందోళనలో ఉన్నాయి. 2025--26 సంవత్సరానికి గాను రైతుబీమా ప్రీమియం కింద ఎల్ఐసీకి రూ.1,359 కోట్లు చెల్లించాల్సి ఉండగా, రూ.436 కోట్లు ఆలస్యంగా చెల్లించినట్టు తెలిసింది. ప్రభుత్వం ప్రీమియం ఆలస్యంగా చెల్లించిన కారణంగా ఈ ఏడాది చనిపోయిన 7,606 రైతులకు సంబంధించిన రైతు బీమాను ఎల్ఐసీ ఇంకా విడుదల చేయలేదు. మరణించిన రైతు కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందలేదు.

### 2 ఎకరాలకే పరిమితమైన రైతుభరోసా

సాగు యోగ్యమైన భూములన్నింటికీ రైతుభరోసా కింద ప్రతి సీజన్‌కు ఎకరానికి రూ.6,000 చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్టు ప్రకటించిన ప్రభుత్వం.. గత యాసంగిలో రాష్ట్రంలోని 71.05 లక్షల రైతుల ఖాతాల్లో రెండు ఎకరాలకు మాత్రమే రూ.5,653 కోట్లను ప్రభుత్వం జమ చేసింది. మార్చి 19న తొలి విడతగా రూ.3,446.94 కోట్లు, రెండో విడతగా రూ.2,206.06 కోట్లను జమచేసింది. రూ.9 వేల కోట్లు రైతుభరోసా కింద చెల్లించనున్నట్టు ప్రకటించినా, రూ.5,653 కోట్లకే పరిమితం చేశారు. ఈ నెల 30న మధిరలో వచ్చే ఖరీఫ్ కోసం రైతుభరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో యాసంగి రైతుభరోసా కథ ముగిసిపోయిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# ఐదేళ్లుగా ఆ పని నేనే చేసుకుంటున్నాను..
# ఒక్కసారి కూడా సెలూన్‌కు వెళ్లలేదు...





నటి శ్రుతి హాసన్ తన ఫ్యాషన్, జీవనశైలితో ఎప్పుడూ ప్రత్యేకంగా నిలుస్తారు. తాజాగా ఆమె తన జుట్టు సంరక్షణ గురించి ఒక ఆసక్తికరమైన విషయాన్ని బయటపెట్టి అందరినీ ఆశ్చర్యపరిచారు. గత ఐదేళ్లుగా తాను కనీసం హెయిర్ సెలూన్‌కు కూడా వెళ్లలేదని, తన జుట్టును తానే కత్తిరించుకోవడంతో పాటు అవసరమైన ట్రీట్‌మెంట్ కూడా ఇంట్లోనే చేసుకుంటానని వెల్లడించారు. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో ముచ్చటించిన శ్రుతి, 'ఆస్క్ మీ ఎనీథింగ్' సెషన్‌లో ఒక అభిమాని అడిగిన ప్రశ్నకు ఈ సమాధానం ఇచ్చారు. మీ పొడవైన, నల్లని జుట్టు సౌందర్య రహస్యం ఏంటి? సెలూన్‌కు ఎంత తరచుగా వెళ్తారు? అని అడగ్గా, శ్రుతి ఏమాత్రం దాచుకోకుండా సమాధానమిచ్చారు. "నేను సెలూన్‌కు వెళ్లి దాదాపు ఐదేళ్లయింది. చివరిసారిగా 2017లో నా జుట్టుకు రంగు వేశాను. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎలాంటి హెయిర్ కలర్ ఉపయోగించలేదు. నా జుట్టును నేనే కత్తిరించుకుంటాను, ట్రీట్‌మెంట్ కూడా నేనే చేసుకుంటాను" అని ఆమె స్పష్టం చేశారు. గ్లామర్ ప్రపంచంలో సెలబ్రిటీలు ఎప్పుడూ తమ బ్యూటీషియన్లు, హెయిర్ స్టైలిస్టులతో బిజీగా ఉంటారు. అలాంటిది 'సలార్' వంటి భారీ చిత్రాల్లో నటించిన శ్రుతి... ఏడేళ్లుగా హెయిర్ డైకి, ఐదేళ్లుగా సెలూన్‌కు దూరంగా ఉండటం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆమె సమాధానం సోషల్ మీడియాలో వైరల్ అయింది. కొందరు అభిమానులు ఆమె నిజాయతీని మెచ్చుకోగా, మరికొందరు ఇంత బిజీగా ఉండి కూడా ప్రొఫెషనల్స్ సహాయం లేకుండా ఎలా మేనేజ్ చేస్తున్నారని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అయితే, శ్రుతి నిర్ణయం వెనుక కేవలం సౌలభ్యం మాత్రమే కాదు, ఒక బలమైన ఫిలాసఫీ కూడా ఉంది. ఆమె ఎప్పటినుంచో స్వీయ సంరక్షణ, మానసిక ఆరోగ్యం గురించి మాట్లాడుతూ ఉంటారు. తన ఫ్యాషన్, సంగీతం, ఫిట్‌నెస్ ఇలా ప్రతి విషయంలోనూ ఇతరుల ఆమోదం కన్నా తన సహజత్వానికే ప్రాధాన్యం ఇస్తారు. రసాయనాలతో కూడిన ట్రీట్‌మెంట్లు, సెలూన్లకు దూరంగా ఉండటం కూడా ఆమె జీవనశైలిలో భాగమే. సెలబ్రిటీల బ్యూటీ రొటీన్లు చాలా ఖరీదైనవి, సామాన్యులకు అందుబాటులో ఉండవనే అభిప్రాయం ఉంది. కానీ, శ్రుతి హాసన్ ఐదేళ్లుగా సెలూన్‌కు వెళ్లకుండానే అందమైన జుట్టును కాపాడుకోవడం ద్వారా ఒక కొత్త సందేశాన్ని ఇచ్చారు. మంచి జుట్టు కోసం ఖరీదైన ఉత్పత్తులు, నిపుణుల బృందం అవసరం లేదని, క్రమశిక్షణతో కూడిన సంరక్షణ ఉంటే చాలని ఆమె నిరూపించారు. గతంలో కూడా అభిమానుల కోసం తాను ఇంట్లో తయారుచేసుకునే హెయిర్ ఆయిల్ రెసిపీని ఆమె పంచుకున్న విషయం తెలిసిందే.





# వృషకర్మ రిలీజ్ డేట్..
# నాగచైతన్య అప్డేట్!

అక్కినేని అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మిస్టికల్ థ్రిల్లర్ 'వృషకర్మ' నుంచి అదిరిపోయే అప్డేట్ వచ్చేసింది. 'విరూపాక్ష' డైరెక్టర్ కార్తీక్ దండు దర్శకత్వంలో చైతన్య చేస్తున్న ఈ సినిమా టీజర్‌తోనే అందరినీ ఆశ్చర్యపరిచింది. తాజాగా ఈ సినిమా షూటింగ్ ఎంతవరకు వచ్చింది? ఎప్పుడు విడుదల కాబోతోంది? అనే విషయాలపై చైతన్య స్వయంగా క్లారిటీ ఇచ్చారు. సినిమా బడ్జెట్ నుంచి విలన్ వరకు అన్నీ ఆసక్తికరంగా ఉన్న ఈ ప్రాజెక్ట్ గురించిన మరిన్ని విశేషాలు చూద్దాం..

షూటింగ్ క్లైమాక్స్‌కు - చైతన్య ఖుషి: నాగచైతన్య తన కెరీర్‌లో ముందెన్నడూ చేయని ఒక విభిన్నమైన రోల్‌లో ఈ సినిమాలో కనిపించబోతున్నారు. తాజాగా మీడియా ఇంటరాక్షన్‌లో చైతూ మాట్లాడుతూ, సినిమా షూటింగ్ ప్రస్తుతం చివరి దశకు చేరుకుందని వెల్లడించారు. ఇక ఇప్పటికే 85 శాతం చిత్రీకరణ పూర్తయిందని, కేవలం 15 శాతం పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని తెలిపారు. మిగిలిన ఆ కొద్ది భాగాన్ని కూడా చకచకా పూర్తి చేసి, ఈ ఏడాది ద్వితీయార్థంలోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది. అవుట్‌పుట్ చూశాక చైతన్య ఎంతో కాన్ఫిడెంట్‌గా ఉండటం విశేషం.

చైతూ కెరీర్‌లోనే భారీ బడ్జెట్: ఈ సినిమాను నిర్మాత బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్ ఏకంగా 120 కోట్ల రూపాయల భారీ వ్యయంతో నిర్మిస్తున్నారు. నాగచైతన్య మార్కెట్ దృష్ట్యా ఇది చాలా పెద్ద రిస్క్ అయినప్పటికీ, కథ మీద ఉన్న నమ్మకంతో మేకర్స్ ఎక్కడా వెనకడుగు వేయడం లేదు. ఇక ఈ ప్యాన్-ఇండియా చిత్రానికి సుకుమార్ రైటింగ్స్ కూడా సహకారం అందిస్తుండటం సినిమాపై క్రేజ్‌ను డబుల్ చేసింది. 'వృషకర్మ'లో విజువల్స్ మరియు మిస్టరీ ఎలిమెంట్స్ హాలీవుడ్ స్థాయిలో ఉంటాయని ఇండస్ట్రీ వర్గాలు గుసగుసలాడుతున్నాయి.

క్రేజీ కాస్టింగ్ - మీనాక్షి చౌదరి, స్పర్ష్ శ్రీవాస్తవ: సినిమాలో నాగచైతన్యకు జోడీగా టాలెంటెడ్ బ్యూటీ మీనాక్షి చౌదరి నటిస్తోంది. అయితే ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవబోతున్నది ఎవరంటే లాపతా లేడీస్ చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన స్పర్ష్ శ్రీవాస్తవ. ఈ సినిమాలో ఆయన విలన్ ఒక పవర్‌ఫుల్ రోల్‌లో మెరవబోతున్నారు. హీరో, విలన్ మధ్య జరిగే మైండ్ గేమ్స్ మరియు యాక్షన్ సీక్వెన్స్‌లు ఆడియన్స్‌ను థ్రిల్ చేస్తాయని తెలుస్తోంది. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం ఈ మిస్టికల్ అడ్వెంచర్‌కు ప్రాణం పోయనుంది.

**అక్కినేని ఫ్యాన్స్‌కు పండగే:**

చివరగా, 'వృషకర్మ' సినిమాతో నాగచైతన్య తన బాక్సాఫీస్ సత్తా చాటుతారని ఫ్యాన్స్ గట్టిగా నమ్ముతున్నారు. కార్తీక్ దండు 'విరూపాక్ష'తో ఎలాగైతే థ్రిల్ చేశారో, అంతకు మించి ఈ సినిమాలో మ్యాజిక్ ఉండబోతోందని సమాచారం. ఇక షూటింగ్ పూర్తయిన వెంటనే గ్రాండ్ లెవల్‌లో ప్రమోషన్స్ ప్రారంభించి, విడుదల తేదీని అధికారికంగా ప్రకటించనున్నారు. 120 కోట్ల భారీ బడ్జెట్, మిస్టికల్ కథాంశం వెరసి ఈ ఏడాది బాక్సాఫీస్ వద్ద చైతన్యకు ఒక సాలిడ్ హిట్ దక్కుతుందని ఆశిద్దాం.


విజువల్ పరంగా

# గ్లామర్ లోకంలో డాక్టర్ శ్రీలీల!



తెలుగు నటి శ్రీలీల డ్యాన్స్‌లు, నటనతోనే కాదు. చదువు పట్ల తనకున్నఅంకితభావంతోనూ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఒకవైపు స్టార్ హీరోలతో వరుస సినిమాలు చేస్తూ బిజీగా ఉంటూనే మరోవైపు ఎంబీబీఎస్ కోర్సును విజయవంతంగా పూర్తి చేయడం హీరోయిన్లలో అరుదైన విషయం. నటిగా కొనసాగుతూ డాక్టర్ర లాంటి పెద్ద చదువును పూర్తి చేయడం అంటే ఆషామాషీ కాదు. రెండు రంగాలపై ఎంతో ఫ్యాషన్ ఉంటే తప్ప సాధ్యం కాదు. మరి వీటిని శ్రీలీల ఎలా బ్యాలెన్స్ చేస్తుంది? అంటే సినిమా షూటింగులు - మెడికల్ చదువులను మేనేజ్ చేయడం ఎలా సాధ్యమని అడిగితే ఆసక్తికర సమాధానం చెప్పింది. దీనికి అచంచలమైన సంకల్పం ఓపిక ఎంతో అవసరం. ఒక్కోసారి పరిస్థితులు క్లిష్టంగా మారతాయి. ఏమీ అర్థం కానట్టు అనిపిస్తుంది. అలాంటప్పుడు సహనంతో నిరణజ్ఞాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఎంత ఇష్టమున్నా? ఒకేసారి రెండింటిలో కొనసాగి ఇబ్బంది పడటం అవసరమా? అనిపిస్తుంది. కానీ మనసు ప్రశాంతంగా ఉంచుకుని నిర్ణయాలు తీసుకుంటే ఏదైనా సాధించొచ్చు అంటుంది. వైద్య వృత్తిపై ఉన్న ఇష్టం, ఆ సబ్జెక్టుపై ఉన్న మక్కువ తనను ముందుకు నడిపించాయంది. పని ఒత్తిడిలో కూడా మనసును ఒక విషయం నుండి మరొక విషయానికి మార్చుకోగలగడం తన విజయ రహస్యంగా తెలిపింది. శ్రీలీల మామ్ కు, తాతయ్యకు ఇచ్చిన మాట కోసం ఎంబీబీఎస్ పూర్తి చేయడానికి ఎంతో శ్రమించింది. షూటింగ్ బ్రేక్స్‌లో కారవాన్‌లో కూర్చుని చదువుకునేది. సెట్స్‌లో ఉన్నప్పుడు కూడా మెడికల్ పుస్తకాలను వెంట ఉంచుకో వడం అలవాటుగా మార్చుకుంది. ముంబైలోని డి.వై. పాటిల్ యూనివర్సిటీ నుండి ఇటీవల పట్టా పొందిన సమయంలో ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారంటే? ఆ డిగ్రీ వెనుక ఎంతటి కష్టం ఉందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా తన తల్లి స్పెషలైజేషన్ అయిన గైనకాలజీలో ఆమె మంచి మార్కులు సాధించడం విశేషం. శ్రీలీల తల్లి స్వర్ణలత వృత్తిరీత్యా గైనకాలజిస్ట్. తల్లిని చూస్తూ పెరగడం వల్లే తనకు కూడా వైద్య వృత్తిపై గౌరవం ఏర్పడిందని శ్రీలీల చెబుతుంది. స్టార్ హీరోయిన్‌గా ఎంత బిజీగా ఉన్నా? తన ప్రాథమిక బాధ్యత చదువేనని ఆమె ఎప్పుడూ నమ్ముతుంది. సినిమా సెట్స్‌లో లైట్ల వెలుతురులో గడుపుతూనే, రాత్రిపూట దీపం వెలుగులో మెడికల్ టెక్స్ బుక్స్‌తో కుస్తీ పట్టడం ఆమె దైనందిన జీవితంలో భాగమైపోయింది. ఒకే సమయంలో రెండు విభిన్నమైన కష్టతరమైన రంగాల్లో రాణించడం అనేది నేటి యువతకు ఒక గొప్ప స్ఫూర్తి. నటనపై ఫ్యాషన్ ఉన్నా? విద్యను నిర్లక్ష్యం చేయకుండా రెండు లక్ష్యాలను చేరుకోవచ్చని శ్రీలీల నిరూపించింది. కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదని ఆమె ప్రస్థానం చూస్తే అర్థమవుతుంది. గ్లామర్ రంగంలో ఉన్నవారికి చదువు అబ్బదు అనే పాతకాలపు ఆలోచనలను శ్రీలీల పటాపంచలు చేసింది. కేవలం అందం మాత్రమే కాదు. మెదడుకు కూడా పదును పెట్టాలని నిరూపించింది. రోగులకు సేవ చేస్తూనే, మరోవైపు ప్రేక్షకులను అలరించనుంది.

# బన్నీ ఫ్యాన్స్‌కు టెస్ట్ టైమ్..
# రాకా కోసం ఇంకా ఎంత వెయిట్?









ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ రాకా చుట్టూ తాజా బజ్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. మొదట 2027 ఏప్రిల్‌లో రిలీజ్ కావాల్సిన ఈ సినిమా, ఇప్పుడు ఆ టైమ్‌లైన్‌ను మిస్ అయ్యే అవకాశాలున్నాయని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమా రిలీజ్ డిసెంబర్ 2027 లేదా సంక్రాంతి 2028కు షిఫ్ట్ అయ్యే ఛాన్స్ ఉందని టాక్ వినిపిస్తోంది. భారీ అంచనాల మధ్య వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై రిలీజ్ వాయిదా వార్తలు ఫ్యాన్స్‌లో ఆసక్తితో పాటు కొంత ఆందోళనను కూడా పెంచుతున్నాయ్ 2027 ఏప్రిల్ వరకు రాకా షెడ్యూల్స్ ఈ ఊహాగానాలకు కారణంగా మారింది ముంబై షూటింగ్ నుంచి బయటకు వచ్చిన ఓ చిన్న క్లూ. చిత్ర యూనిట్ ఉపయోగిస్తున్న ఐడెంటిటీ ట్యాగ్‌పై ఉన్న వివరాల ప్రకారం, షూటింగ్ షెడ్యూల్ ఏప్రిల్ 2027 వరకూ కొనసాగవచ్చని సంకేతాలు కనిపించాయి. సాధారణంగా పెద్ద సినిమాలకు లాంగ్ షెడ్యూల్స్ ఉండటం కొత్త విషయం కాదు. కానీ రాకా విషయంలో ఈ స్థాయి లాంగ్ షూటింగ్ ఎందుకు అవసరమైంది అన్న ప్రశ్న ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. డైరెక్టర్ అట్లీ తన స్టైల్‌కు తగ్గట్టుగా ప్రతి సీన్‌ను గ్రాండియర్‌గా ప్లాన్ చేస్తున్నారనే టాక్ ఉంది. రాకా హాలీవుడ్ టెక్నీషియన్స్ కూడా ఇక ఈ ఆలస్యానికి మరో కీలక కారణంగా చెప్పబడుతున్నది భారీ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్. ఈ సినిమా కోసం హాలీవుడ్‌కు చెందిన పలువురు టెక్నీషియన్స్ కూడా వర్క్ చేస్తున్నారు. ముఖ్యంగా విజువల్ ఎఫెక్ట్స్‌పై ఎక్కువ ఫోకస్ పెట్టిన ఈ సినిమా, పోస్ట్ ప్రొడక్షన్‌కే ఎనిమిది నెలల కంటే ఎక్కువ సమయం తీసుకునే అవకాశం ఉందని ట్రేడ్ అంచనాలు చెబుతున్నాయి. ఇదే నిజమైతే, రాకా కొత్త బెంచ్‌మార్క్ సెట్ చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఫ్యాన్స్ మిక్స్డ్ రియాక్షన్స్ అయితే ఈ భారీ స్కేల్ ఒకవైపు హైప్‌ను పెంచుతుండగా, మరోవైపు వెయిటింగ్ టైమ్ కూడా పెరుగుతోంది. కాగా ఈ విషయంలో సోషల్ మీడియాలో ఫ్యాన్స్ రియాక్షన్ మిక్స్‌డ్‌గా ఉంది. మంచి క్వాలిటీ కోసం ఎంతైనా వెయిట్ చేస్తామని ఓ వర్గం చెబుతుండగా, ఇంకా ఎంత కాలం వెయిట్ చేయాలంటూ మరో వర్గం ప్రశ్నిస్తోంది. అల్లు అర్జున్ ఫ్యాన్ బేస్ లో మాత్రం ఈ ప్రాజెక్ట్ పై రోజురోజుకూ ఆసక్తి పెరుగుతూనే ఉంది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న రాకా గ్లోబల్ మార్కెట్‌ను టార్గెట్ చేస్తోందని స్పష్టమవుతోంది. అందుకే మేకర్స్ రిలీజ్ టైమింగ్ విషయంలో కూడా జాగ్రత్తగా ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. సంక్రాంతి 2028 సీజన్‌ను టార్గెట్ చేస్తే, భారీ బాక్సాఫీస్ రన్ సాధించే అవకాశం ఉంటుందని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు. అదే సమయంలో, ఇతర స్టార్ సినిమాలతో క్లాష్ ఎలా ఉంటుందన్నది కూడా ఆసక్తికర అంశంగా మారింది. మొత్తానికి, భారీ అంచనాలు, విస్తృతమైన నిర్మాణ ప్రక్రియ, హాలీవుడ్ స్థాయి టెక్నికల్ వర్క్ అన్నీ కలిపి రాకాను ఒక లాంగ్ గెస్టేషన్ ప్రాజెక్ట్‌గా మార్చుతున్నాయి.

# త్రిష కృష్ణన్ 100 కోట్ల సామ్రాజ్యం
# 25 ఏళ్ల సినీ ప్రస్థానంలో అరుదైన మైలురాయి!





దక్షిణాది సినీ పరిశ్రమలో -ఎవర్ గ్రీన్ క్వీన్-గా వెలుగొందుతున్న త్రిష కృష్ణన్ తన 25 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో కేవలం నటిగానే కాకుండా ఒక బ్రాండ్‌గా ఎదిగారు. ప్రస్తుతం త్రిష నికర ఆస్తి విలువ సుమారు 100 కోట్ల రూపాయలకు చేరుకోవడం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. 1999లో -జోడి- చిత్రంతో సహాయ నటిగా ప్రయాణం మొదలుపెట్టిన త్రిష.. నేటికీ అగ్ర కథానాయికగా కొనసాగుతూ తనకంటూ ఒక ప్రత్యేక సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారు. ఒక నటిగా ఇన్ని దశాబ్దాల పాటు తన క్రేజ్‌ను కాపాడుకుంటూ ఆర్థికంగా ఇంతటి ఉన్నత స్థితికి చేరుకోవడం ఆమె పట్టుదలకు నిదర్శనం. త్రిష ఆదాయ వనరులను పరిశీలిస్తే.. ఒక్కో సినిమాకు సుమారు 3 కోట్ల రూపాయల వరకు పారితోషికం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. -పొన్నియిన్ సెల్వన్- వంటి భారీ విజయాల తర్వాత డిమాండ్ మరింత పెరిగింది. సినిమాలతో పాటు కార్పొరేట్ సంస్థల ప్రకటనల ద్వారా కూడా ఆమె భారీగానే ఆర్జిస్తున్నారు. సుమారు రెండు దశాబ్దాలకు పైగా టాప్ బ్రాండ్లకు అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ.. స్థిరమైన ఆదాయాన్ని గడించారు. ఈ సంపాదనను తెలివిగా వివిధ రంగాల్లో పెట్టుబడిగా మలిచారు. త్రిష ఆస్తిపాస్తుల్లో ప్రధానమైనవి హైదరాబాద్ - చెన్నైలలోని విలాసవంతమైన నివాసాలు. ముఖ్యంగా చెన్నైలోని ఆమె సొంత ఇల్లు అత్యంత ఖరీదైన ఇంటీరియర్స్‌తో సకల సౌకర్యాలతో కూడి ఉంది. దీని విలువ దాదాపు 10 కోట్ల రూపాయలకు పైగానే ఉంటుందని అంచనా. ఇవే కాకుండా.. రియల్ ఎస్టేట్ రంగంలో కూడా భారీగా పెట్టుబడులు ఉన్నాయి. పలు నగరాల్లో విలువైన భూములు - వాణిజ్య సముదాయాల్లో భాగస్వామ్యం ఉండటం త్రిష ఆర్థిక భవిష్యత్తుకు మరింత భరోసాగా నిలిచాయి. విలాసవంతమైన జీవనశైలికి మారుపేరైన త్రిషకు లగ్జరీ కార్లంటే ఎంతో ఇష్టం. గ్యారేజీలో బిఎండబ్ల్యూ, మెర్సిడెస్ బెంజ్, రేంజ్ రోవర్ వంటి ఖరీదైన కార్లు ఉన్నాయి. కేవలం భౌతిక సంపాదనే కాకుండా..జంతు సంరక్షణ .. పలు సేవా కార్యక్రమాల కోసం తన సంపాదనలో కొంత భాగాన్ని వెచ్చిస్తూ సమాజం విషయంలో తన బాధ్యతను చాటుకుంటున్నారు. త్రిష లైఫ్ స్టైల్ నేటి తరం యువ నటీమణులకు ఒక రోల్ మోడల్‌గా నిలుస్తోంది. వృత్తిపరమైన ఒడిదుడుకులు ఎదురైనా.. వ్యక్తిగత జీవితంలో ఎన్ని విమర్శలు వచ్చినా కుంగిపోకుండా తన కెరీర్‌ను విజయవంతంగా మలుచుకున్న త్రిష ప్రయాణం స్ఫూర్తిదాయకం. 40 ఏళ్ల వయసులోనూ కుర్ర హీరోయిన్లకు పోటీనిస్తూ..మరోవైపు వంద కోట్ల ఆస్తిని కూడబెట్టడం చూస్తుంటే.. త్రిష వృత్తి గతంగా చూపే అంకితభావానికి ప్రతిఫలం.



Printed, Polished, Owned by BESTHA SHIVA RAMUDU & Printed UTTEJITA PRINTERS H.NO -801, BUDHAWAR PETA, KURNOOL, ANDHRA PRADESH - 518001. APTEL2023/88704 & Published at D.No.4-458, PAIGEAR, NANDAVARAM, V&P. KURNOOLD.T. (A.P)-518343,CELL:9494741301.